www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 132 శనివారం, సెప్టెంబర్ 26, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad




# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

**తొలి దశలో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానాల ఏర్పాటు.. కేసుల భారాన్ని తగ్గించడమే లక్ష్యం**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** రాష్ట్రంలో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు స్థానికంగానే వేగంగా న్యాయ సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 200 అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. **594 న్యాయస్థానాల అవసరాన్ని గుర్తించిన హైకోర్టు** రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొత్తం 594 కొత్త న్యాయస్థానాలు, వాటికి అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం స్పందించి తొలి దశగా 200 న్యాయస్థానాలకు అనుమతి

మిగతా2లో...



# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

**ఘనంగా ఖైరతాబాద్ గణేశుని శోభాయాత్ర**

**భారీ భద్రతా వలయంలో హైదరాబాద్**

**11 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాగణపతిని కడసారి దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు.**

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** అశేష భక్త వాహిని జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తులతో ధూపదీప నైవేద్యాలందుకున్న ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరుకున్నాడు. ఈ క్రతువును చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో హైదరాబాద్ నగరం జనసంద్రంగా మారింది.తొలుత బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపంతో బడా గణేశ్ టస్కర్‌పైకి ఆలస్యంగా చేరాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన శోభాయాత్ర, క్రేన్‌లో సమస్య కారణంగా 3 గంటల ఆలస్యంగా 9 గంటలకు ప్రారంభమైంది. 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై' అంటూ భక్తుల జయజయధ్వానాలు

మిగతా2లో...

## సీబీఎస్ఈ నూతన ఛైర్మన్‌గా మందీప్ కే బండారి

**- కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన సారథిగా సీనియర్ ఐఏఎస్ అధికారి**




## ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

**సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పు కోసం పనిచేయాలి: ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25 :** ఓటు బ్యాంకు రాజకీయాలపై దృష్టి పెట్టకుండా సామాజిక సంస్కరణలు, సమాజంలో సానుకూల మార్పు కోసం కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు కొనసాగుతున్న 'సేవా యాత్ర'లో పాల్గొంటున్న వారితో

మిగతా2లో...

## రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**- రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్యుల సంక్షేమ పాలనకు గుర్తింపు**




## రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రధాని, హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇతర పార్టీల గుర్తులపై గెలిచిన పలువురు శాసనసభ్యులను

మిగతా2లో...



## 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

**వీరమణి వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రిని ప్రశ్నించిన తమిళగ వెట్రి కళగం అధినేత**

**చెన్నై:సెప్టెంబర్ 25 :** తమిళనాడులో అధికార డీఎంకే, అన్నాడీఎంకేలపై తమిళగ వెట్రి కళగం అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ విమర్శలు గుప్పించారు. మదురాంతకం శాసనసభ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన డీఎంకేను తీవ్రంగా విమర్శిస్తూ, రెండు ద్రవిడ పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు.గ్రానైట్ వ్యాపారి

మిగతా2లో...

## గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

**- తొలి దశలో 7,448 కి.మీ. రహదారుల అభివృద్ధి.. దసరా నాటికి పనులు ప్రారంభించాలి: మంత్రి సీతక్క**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** గ్రామీణ తెలంగాణలో శాశ్వత మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ వార్షిక చెల్లింపు విధానం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. తొలి దశలో 7,448 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దసరా నాటికి అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీతక్క సూచించారు. ప్రతి జలాశయంలో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షించి, ఏడాది తాగునీటి అవసరాలను ముందుగానే నిర్ధారించాలని అన్నారు. మిషన్ భగీరథలో సమస్యలు ఉన్న 86 జనావాసాల్లో నీటి సరఫరాను అత్యవసరంగా పునరుద్ధరించాలని ఆదేశించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. "కూలీకి పని..

మిగతా2లో...

## బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

**- లఖ్నవూలో తయారవుతున్న క్షిపణితో శత్రువులకు భయం: అమిత్ షా**



**లఖ్నవూ:సెప్టెంబర్ 25 :** లఖ్నవూలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణితో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు వచ్చాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 తుపాకులతో నక్సలైట్లు, ఉగ్రవాదులకు కూడా కంటిమీద కునుకు లేకుండా

మిగతా2లో...

# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. కొత్త న్యాయస్థానాల ఏర్పాటుతో కేసుల విచారణకు అదనపు సామర్థ్యం ఏర్పడటంతో పాటు న్యాయం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు స్థానిక స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

**రంగారెడ్డికి అత్యధికంగా 30 న్యాయస్థానాలు** కొత్త న్యాయస్థానాల కేటాయింపులో రంగారెడ్డి జిల్లాకు అత్యధికంగా 30 కేటాయించారు. రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 25, హైదరాబాద్ నగర పరిధిలోని సిటీ సివిల్, సెషన్స్ న్యాయస్థానాల పరిధికి 16 న్యాయస్థానాలు కేటాయించారు.

ఇతర జిల్లాల్లో నల్గొండకు 10, ఖమ్మం, సంగారెడ్డికి 8 చొప్పున, కరీంనగర్, సూర్యాపేటకు 7 చొప్పున, నిజామాబాద్, జగిత్యాలకు 6 చొప్పున, సిద్దిపేట, మంచిర్యాలకు 5 చొప్పున న్యాయస్థానాలు మంజూరయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలకు కలిపి 12 న్యాయస్థానాలు కేటాయించారు.

**ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలపై ఆశలు** కొత్త న్యాయస్థానాల ఏర్పాటు ద్వారా ఇప్పటికే ఉన్న న్యాయస్థానాలపై కేసుల భారం కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, సాధారణ స్వభావం గల కేసుల విచారణకు అదనపు న్యాయస్థానాలు అందుబాటులోకి రావడం వల్ల విచారణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. అయితే న్యాయస్థానాల పూర్తి స్థాయి కార్యకలాపాలకు అవసరమైన న్యాయమూర్తులు, సిబ్బంది, భవనాలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు కూడా కీలకం కానుంది.

# రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కేరళకు చెందిన ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మహమ్మద్2026 ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం' అందజేసింది. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు.

**సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు** తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ శాసనసభ్యుడు ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామిక విలువల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న నిబద్ధతను ఎంపిక కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు వెల్లడించారు.

**ముగ్గురితో కూడిన ఎంపిక కమిటీ** పురస్కార ఎంపిక కమిటీలో పార్లమెంట్ సభ్యుడు బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఏ.పీ. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ ఉన్నారు. ఈ కమిటీ పరిశీలన అనంతరం రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసింది.

కేరళకు చెందిన ఈ పురస్కారాన్ని తొలిసారిగా కేరళ వెలుపలికి చెందిన వ్యక్తికి అందిస్తున్నట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు.

**ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం** కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, నాలుగు వేర్వేరు మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. ప్రజా సంక్షేమం, లౌకిక విలువలు, ప్రజాస్వామిక విధానాల పట్ల ఆయనకున్న నిబద్ధతకు గుర్తింపుగా ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని కొనసాగిస్తోంది. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా నిలంబూర్‌లో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

**వేడుకలో రేవంత్‌రెడ్డి ప్రసంగం** పురస్కారం స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి ఆర్యదాన్ మహమ్మద్ ప్రజా జీవితాన్ని స్మరించుకున్నారు. కేరళలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్య భావాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. పురస్కారాన్ని తన వ్యక్తిగత గౌరవంగా కాకుండా కాంగ్రెస్ కార్యకర్తగా అందుకుంటున్న గుర్తింపుగా పేర్కొన్నారు. కే.సీ. వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం చేశారు.

# చైనాలో చదువుకోండి.. అమెరికా యువతకు జిన్‌పింగ్ ఆహ్వానం

### ఐదేళ్లలో లక్ష మంది యువతను ఆహ్వానిస్తాం.. విద్య, సాంస్కృతిక మార్పిడితో సంబంధాలు బలోపేతం



**వాషింగ్టన్,సెప్టెంబర్ 25 :** చైనాఅమెరికా సంబంధాలను ప్రజల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక ప్రతిపాదన చేశారు. వచ్చే ఐదేళ్లలో లక్ష మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించనున్నట్లు ఆయన ప్రకటించారు. విద్య, పర్యటనలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి వాషింగ్టన్‌లో చేసిన సంయుక్త ప్రకటనలో జిన్‌పింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు.

**ఇప్పటికే 50 వేల మంది లక్ష్యం పూర్తి** 2023లో తాను ప్రకటించిన 50 వేల మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించాలన్న లక్ష్యం నిర్ణీత గడువుకు ముందుగానే పూర్తయిందని జిన్‌పింగ్ తెలిపారు. దీనికి కొనసాగింపుగా మరో ఐదేళ్లలో లక్ష మంది యువతను విద్యా, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల కోసం ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఇరుదేశాల మధ్య పరస్పర అవగాహన పెరగడానికి యువత మార్పిడి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. చైనాఅమెరికా సంబంధాల భవిష్యత్తు ఇరు దేశాల ప్రజలపై, ముఖ్యంగా యువతపై ఆధారపడి ఉందని జిన్‌పింగ్ అన్నారు. ప్రజల మధ్య స్నేహం బలపడితే రెండు దేశాల మధ్య సంబంధాలకు మరింత స్థిరమైన పునాది ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**చారిత్రక సంబంధాలను గుర్తుచేసిన జిన్‌పింగ్** రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా, అమెరికా ప్రజలు కలిసి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించారు. ఆ చారిత్రక సహకారాన్ని ఇరు దేశాల ప్రజలు గుర్తుంచుకున్నారని చెప్పారు. చైనా తన జాతీయ పునరుజ్జీవన లక్ష్యాలను సాధించడం, అమెరికా తన దేశాన్ని మరింత బలోపేతం చేసుకోవడం రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావని పేర్కొన్నారు. ఇరు దేశాలు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని సహకారాన్ని పెంచుకోవాలని, ప్రజల మధ్య స్నేహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ఇరు దేశాల మధ్య స్థిరమైన సంబంధాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

**ఉమ్మడి ప్రయోజనాలపై ట్రంప్ దృష్టి** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరు దేశాల మధ్య ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌కు వ్యతిరేకంగా చైనాకు అమెరికా అందించిన సహాయాన్ని గుర్తుచేశారు. భద్రత, సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల నాయకులు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ దశాబ్దాల్లో శాంతి, సౌభాగ్యంపై ప్రభావం చూపగలవని అన్నారు. ప్రస్తుతం వాణిజ్యం, సాంకేతికత, భద్రత వంటి అంశాల్లో అమెరికాచైనా మధ్య విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, తాజా భేటీలో ఇరు దేశాల మధ్య సంభాషణ, సహకారం కొనసాగించాలనే అంశానికి ప్రాధాన్యం లభించింది.

**యువత మార్పిడికి ప్రాధాన్యం** జిన్‌పింగ్ ప్రకటించిన లక్ష మంది యువత ఆహ్వానం ఇరు దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలను ప్రజల స్థాయిలో విస్తరించే ప్రతిపాదనగా నిలిచింది. ప్రభుత్వాల మధ్య చర్చలతో పాటు విద్యార్థులు, యువత, విద్యా సంస్థలు, సాంస్కృతిక వర్గాల మధ్య ప్రత్యక్ష సంబంధాలను పెంచడం ద్వారా పరస్పర అవగాహనను మెరుగుపరచాలన్న ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది. తాజా అమెరికా పర్యటనలో జిన్‌పింగ్, ట్రంప్ ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

# ఐక్యత చాటిన తెలంగాణ.. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

### రాష్ట్రవ్యాప్తంగా 88 వేల విగ్రహాల నిమజ్జనం.. హైదరాబాద్‌లో 25 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తెలంగాణలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రజలు సంయమనం, సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తూ రాష్ట్ర ఐక్యతను చాటారని పేర్కొన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన విగ్రహాల్లో 1.24 లక్షలు అధికారిక పోర్టల్‌లో నమోదయ్యాయని డీజీపీ తెలిపారు. గతేడాది నమోదైన సంఖ్యతో పోలిస్తే ఈసారి పెరుగుదల నమోదైందన్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం సంఖ్య 3.5 నుంచి 4 లక్షల వరకు ఉండే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం ఉదయం వరకు సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, మిగిలిన విగ్రహాల నిమజ్జనం శనివారం ఉదయానికి పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు** హైదరాబాద్‌లో నిమజ్జనోత్సవాల కోసం గత పది రోజులుగా 25 వేల మందికిపైగా పోలీసు సిబ్బందిని బందోబస్తులో వినియోగించినట్లు డీజీపీ తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత కోసం పోలీసు శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేశాయని చెప్పారు. నిమజ్జన మార్గాలు, వంతెనలు, రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

**శోభాయాత్రలకు కొంత ఆలస్యం** శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ హైదరాబాద్‌లో కొన్ని శోభాయాత్రలు మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని ఆనంద్ వివరించారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ కూడా ఆలస్యంగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు ఒకేసారి నిమజ్జనానికి తరలివస్తుండటంతో సమయం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీసులు పరస్పరం సహకరించుకోవడంతో నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల ప్రారంభం నుంచే భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసు శాఖ.. విగ్రహాల వివరాలను నమోదు చేయడం, నిమజ్జన మార్గాలను ముందస్తుగా గుర్తించడం, రద్దీ ప్రాంతాలను పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టింది.

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

(మొదటి పేజీ తరువాయి)

మార్మోగాయి. అశేష భక్తజనావళి నినాదాల మధ్య ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడుబడా గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర ట్యాంక్‌బండ్ క్రేన్ 4 వద్దకు చేరుకుంది. భక్తులు గణనాథుడిపైకి పుష్పాలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆ గణనాథుని కడసారి చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దారి పొడవునా జై బోలో గణేశ్ మహరాజ్ కీ అంటూ నీరాజనాలు పలికారు. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి గణేశుడు చేరుకున్నాడు. నిమజ్జనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నగరాన్ని భారీ భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. 20 వేల మందికి పైగా సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను రంగంలోకి దించారు. ఇక మహా నిమజ్జన శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది.

# సీబీఎస్ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25 :** కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి మందీప్ కే బండారి నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇటీవల పరీక్షల నిర్వహణ, తెరపై మార్కుల నమోదుకు సంబంధించి విమర్శలు ఎదుర్కొన్న కేంద్ర మాధ్యమిక విద్యా మండలికి ఆయన సారథ్యం వహించనున్నారు. మందీప్ కే బండారి 2001 బ్యాచ్‌కు చెందిన అగ్ముట్ కేడర్ ఐఏఎస్ అధికారి. వైద్య విద్యలో పట్టా పొందిన ఆయన ఎంబీబీఎస్‌లో స్వర్ణ పతకం సాధించారు. రెండు దశాబ్దాలకు పైగా పరిపాలనా రంగంలో సేవలందించిన ఆయన, ఇకపై విద్యా వ్యవస్థలో సంస్కరణ లు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. చైర్మన్ పదవిని తాత్కాలికంగా అదనపు కార్యదర్శి స్థాయికి మార్చడంతో ఆయనకు అదే స్థాయి వేతన, భత్యాలు వర్తించనున్నాయి.

# ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు.గత 12 ఏళ్లలో నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కూడా పెరిగిందన్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంతో పాటు సామాజిక సంస్కరణల కోసం కృషి చేశారని గుర్తుచేశారు.ప్రయాగ్‌రాజ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టిన వారి సేవలను ప్రధాని ప్రశంసించారు. వారి కృషితో కుంభమేళాకు పారిశుద్ధ్య నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. సమాజానికి సేవ చేసేవారికి తగిన గౌరవం దక్కాలని, సేవా యాత్ర తన జీవితంలో ఎంతో ప్రాధాన్యమైనదని మోదీ పేర్కొన్నారు.

# 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్. వీరమణికి సంబంధించిన బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం కేసును విజయ్ ప్రస్తావించారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనే కేసు నమోదైనప్పటికీ దర్యాప్తు తీరుపై ప్రశ్నలు తలెత్తాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఉద్దేశించి 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి' అని ప్రశ్నించారు.కేసులో పోలీసులు తొలుత దర్యాప్తు ముగించేందుకు నివేదిక సమర్పించగా, ప్రత్యేక న్యాయస్థానం దానిని తిరస్కరించి తదుపరి దర్యాప్తుకు ఆదేశించింది. అనంతరం వీరమణితో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, గత ప్రభుత్వం ఎవరినీ కాపాడేందుకు ప్రయత్నించలేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తన ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలు అసత్యమైనవని ఆయన పేర్కొన్నారు.

# బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటి పేజీ తరువాయి)

పోయిందని పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు.ఉత్తరప్రదేశ్ రక్షణ పారిశ్రామిక మార్గంలో ఝాన్సీ, చిత్రకూట్, లఖ్నవూ, ఆగ్రా, అలీగఢ్, కాన్పూర్ ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ ఆర్థికంగా పురోగమిస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వివిధ దేశాలతో పలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు.
దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు అనర్హత వేటు నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ అంశాలపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి శాశ్వత ఆస్తి" అనే లక్ష్యంతో ఉపాధి పనులు చేపట్టాలని తెలిపారు.
అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో వచ్చే ఏడాది చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రజలతో చర్చించి ఆమోదించాలని అధికారులకు సూచించారు.

# హైదరాబాద్‌లో రాపిడో ఫుడ్ డెలివరీ సేవలు




**హైదరాబాద్,సెప్టెంబర్ 25** బెంగళూరు తర్వాత రాపిడో సంస్థ తన ఓన్లీ ఫుడ్ డెలివరీ సేవలను హైదరాబాద్‌లోకి విస్తరించింది. ఇది జీరో కమిషన్ మోడల్‌పై పని చేస్తోంది. దీని సహ వ్యవస్థాపకుడు అరవింద్ శంకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ గొప్ప ఫుడ్ నగరమని, కస్టమర్లకు నిజమైన ధరలకే ఆహారం అందిస్తామని తెలిపారు. ఈ యాప్ ద్వారా రెస్టారెంట్లకు ఎలాంటి కమిషన్ భారం ఉండదని, ప్రస్తుతం ఇది 20 వేలకు పైగా రెస్టారెంట్లతో భాగస్వామ్యం కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది.

## ఆత్మగౌరవ భవనాలు, మేడారం జాతరలో, 2004 లో జరిగిన ఒప్పందం సాదించేవరకూ సమరశీల ఉద్యమాలకు నాయిబ్రాహ్మణులు సిద్ధం కావాలి



**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** ములుగు జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీస్ ప్రాంగణంలో జరిగిన అత్యవసర సమావేశంలో పాల్గొన్న గౌరవ అధ్యక్షులు మధ్ధూరు రాములు జిల్లా అధ్యక్షులు చిక్కుల వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్న కుమార్ కార్యదర్శులు ముత్యాల ప్రకాష్ ములుగు జిల్లా కేంద్రంలో ఏటూరునాగారం మేడారం లో నాయిబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్స్, (ఆత్మగౌరవ భవణాలు) మేడారం జాతరలో 2004 లో జరిగిన ఒప్పందాలను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ది, స్త్రీ శిశు సంక్షేమ శాఖా ధనసరి అనసూయ (సీతక్క) సహకారం తో సాదించుకునే వరకూ, జిల్లాలోని నాయిబ్రాహ్మణలు సమరశీల సంఘటిత ఉధ్యమాలకు సిద్దం కావాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో పాల్గొన్నవారు, జిల్లా కోశాధికారి దుబ్బాక ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల రాజు,మధ్దూరు రాజు,అన్నం తిరుపతి, కురిమిల్ల సంపత్, జంపాల చంద్రశేఖర్, దేవరకొండ వేణు,మర్రిపెల్లి కిషన్,నవీన్, తదితరులు,

## వరంగల్ విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

- ●తెలంగాణ ఆత్మగౌరవం కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన మహనీయుడికి ఇదే సముచిత గౌరవం
- ●27న జరగబోయే బాపూజీ జయంతి సందర్భంగా సీఎం ప్రకటన చేయాలి
- ●పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్



**మొగుళ్ళ పల్లి ప్రతినిధి సెప్టెంబర్ 25 ( పీపుల్స్ న్యూస్)** తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును వరంగల్ విమానాశ్రయానికి పెట్టాలని పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కోసం మంత్రి పదవినే త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన బాపూజీ సేవలను చిరస్మరణీయంగా నిలిపేలా కొండా లక్ష్మణ్ బాపూజీ విమానాశ్రయంగా నామకరణం చేయాలని కోరారు. ఈ నెల 27న బాపూజీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పదవుల కంటే ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే ముఖ్యమని తన ఆచరణ ద్వారా బాపూజీ చాటిచెప్పారన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, అట్టడుగు వర్గాల హక్కుల కోసం బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. తెలంగాణ సమాజానికి కాకుండా ఆయన సేవలు పద్మశాలి సమాజానికి గర్వకారణమని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడి పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా ఆయన సేవలకు తగిన గౌరవం లభిస్తుందన్నారు.

## భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవానికి మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం



**బాలానగర్ సెప్టెంబర్ 26 ( పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ సంఘం ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పటోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం కమిటీ సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించనున్న సంఘం తొలి వార్షికోత్సవ సమావేశం, కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబును ప్రత్యేకంగా ఆహ్వానించారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సంక్షేమ సంఘం నిరంతరం పనిచేస్తోందని ప్రతినిధులు తెలిపారు. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీ వాసులను, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.మంత్రి శ్రీధర్‌బాబును కలసి ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్, చందిరి కొండల్‌రెడ్డి, రమేష్ యాదవ్, నాగేశ్వర్‌రావు, నరేష్‌కుమార్, మధు, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.కాలనీ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించ నున్న కార్యక్రమానికి మంత్రి హాజరై సభ్యులు, కాలనీ వాసులను ఉద్దేశించి మాట్లాడాలని సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు..

# కాకతీయుల శిల్పకళా వైభవం.. ప్రకృతి వర్ణశోభకు నిలయంగా ములుగు జిల్లా

- ●విశ్వవేదికపై విరాజిల్లుతున్న ప్రపంచ వారసత్వ రామప్ప దేవాలయం
- ●చారిత్రక, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలి
- ●రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క


















**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25( పీపుల్స్ న్యూస్)** కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ప్రకృతి వర్ణశోభకు ములుగు జిల్లా నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.

శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో వరల్డ్ టూరిజం డే--2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్స్, తెలంగాణ దర్శిని, కాంపిటీషన్స్, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 వరల్డ్ టూరిజం డేను "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారధి కళాకారుల బృందం గేయాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రిఅనసూయ సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శతాబ్దాలుగా తరతరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన ములుగు జిల్లాలో పచ్చని అడవులు, అందమైన చెట్లు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులతో అపారమైన ప్రకృతి సంపద ఉందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పూర్వీకులు అందించిన వారసత్వంగానే కాకుండా భావితరాలకు తిరిగి అందించాల్సిన విలువైన ఆస్తిగా భావించాలని మంత్రి సూచించారు. పర్యావరణం, చరిత్ర పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు.

అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చల్వాయి టీజీఎంఎస్‌కు చెందిన డి. శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్. శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. మనస్విని, ఎ. శ్రుతి, ఎం. పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె. దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీకగా రాజుకాలనీ వినాయక చవితి వేడుకలు



**బాలానగర్ సెప్టెంబర్ 26 ( పీపుల్స్ న్యూస్)** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజు కాలనీలో వినాయక చవితి వేడుకలు కులమతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా ఘనంగా సాగుతున్నాయి. గణనాథుడిని కేవలం ఒక మతానికి పరిమితం చేయకుండా, సమాజంలోని అన్ని వర్గాలను ఏకం చేసే పవిత్ర పండుగగా స్థానిక ప్రజలు భావిస్తూ ఏటా ఐక్యతను చాటుతున్నారు. దుర్గ యూత్ ఆధ్వర్యంలో రాజు కాలనీ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన గణేష్ మండపానికి స్థానిక ముస్లిం మైనారిటీ పెద్దలు తమవంతు పూర్తి సహాయ సహకారాలు అందించారు. మండపం ఏర్పాటు మొదలుకొని భక్తులకు మంచినీరు, ప్రసాదాల పంపిణీ వరకు ప్రతి విషయంలోనూ ముస్లిం సోదరులు చురుగ్గా పాల్గొని.. కుల, మత, పేద, ధనిక అనే తేడాల్లేకుండా రక్షణ బాధ్యతలను సైతం భుజాన వేసుకుని సోదరభావాన్ని చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకుడు మాక్బూల్ మాట్లాడుతూ"మనమంతా ఒక్కటే. మానవత్వమే మన మతం. హిందూ, ముస్లింలమని వేర్వేరుగా చూడకుండా అందరూ సోదరభావంతో, ఐక్యతతో కలిసిమెలిసి జీవించాలని ఆకాంక్షించారు. భాగస్వాములై, సేవాలత్పరత చూపిన ముస్లిం సోదరులను నిర్వాహకులు స్థానిక కాంగ్రెస్ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి, న్యాయవది ఎల్ఎస్ రావు సమక్షంలో శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గొప్పుగోని శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్, రూపాన్ని మధు, వెంకటేష్ గౌడ్ (ఎన్టిఆర్), మహంకాళి శ్రీనివాస్, రఫీక్, మహంకాళి సూరి, ఆంజనేయులు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ్ నగర్‌లో ఘనంగా గణనాథుని పూజలు

**- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా.. అనంతరం అన్నదానం**

బాలానగర్ సెప్టెంబర్ 26 ( పీపుల్స్ న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలోని కళ్యాణ్ నగర్‌లో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కుల మతాలకు అతీతంగా మత సామరస్యానికి ప్రతీక కళ్యాణ్ నగర్ వాసుల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ బాలానగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా వినాయక మండపాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. గణనాథుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక మండపం వద్ద భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మహమ్మద్ ఖాజాను కళ్యాణ్ నగర్ వాసులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వినాయక ఉత్సవాల ప్రాముఖ్యతను, భక్తి భావంతో నిర్వహిస్తున్న



కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, మహిళా నాయకురాలు స్వాతి, స్వామి, చారి, కాశయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గణనాథుని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో కళ్యాణ్ నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## ఫతేనగర్ డివిజన్ పోచమ్మ టెంపుల్ పంచాయతీ ఆఫీస్ వినాయకుని దర్శనం



**ఫతేనగర్ :**ఫతేనగర్ డివిజన్ పోచమ్మ టెంపుల్ పంచాయతీ ఆఫీస్ వినాయకుని దర్శించుకుని విగ్నేశ్వరుని ఆశీస్సులు తీసుకున్నారు ఫతేనగర్ కంటెంట్ కార్పొరేటర్ కే రాజు, సూరజ్ తివారి, నర్సింగ్ మరియు అశోక్ చారి పాల్గొన్నారు

# గ్రామాల్లో మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుంది.

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**





(లక్ష్మీదేవి పేట )ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్) గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్య ఇస్తూ నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 2025--26 సీఆర్ఆర్ నిధులు రూ.1 కోటి 80 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం లక్ష్మీదేవిపేట గ్రామంలో 2025--26 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 2025--26 ఎస్సీ ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 లక్షల అంచనా వ్యయంతో, సీఆర్ఆర్ ప్లెయిన్ నిధులు రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అవసరమైన రహదారులు, భవనాలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులు ఐక్యంగా ఉంటూ గ్రామాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా లీగల్ అడ్వైసర్‌గా రాగళ్ళ శ్రీహరి,



జనగామ: సెప్టెంబర్ 25(పీపుల్స్ న్యూస్ ) జనగామ జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ () సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాగళ్ళ శ్రీహరి పాల్గొన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలు, వారి హక్కులు, సంక్షేమం, చట్టపరమైన అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా రాగళ్ళ శ్రీహరిని జనగామ జిల్లా ఆటో డ్రైవర్ యూనియన్ () జిల్లా లీగల్ అడ్వైసర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా లీగల్ అడ్వైసర్ బాధ్యతలు అప్పగించిన యూనియన్ నాయకులు, సభ్యులకు రాగళ్ళ శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ప్రధాన రోడ్లపై వాహన, తోపుడు బండ్లకు నిలిపేందుకు చోటు లేదు.. నిత్యం ట్రాఫిక్ తనిఖీలు

**-- బాలానగర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు.. ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు**






బాలానగర్ సెప్టెంబర్ 26 ( పీపుల్స్ న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్ బాలానగర్ డివిజన్ ప్రధాన రహదారులపై తరచూ ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపేందుకు బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ప్రయాణించేలా రహదారులపై ఆక్రమణలు, రహదారి పక్కన ఏర్పాటు చేసిన తాత్కాలిక వ్యాపారాలను క్రమ బద్ధీకరిస్తున్నారు. శుక్రవారం బాలానగర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులు రాజు కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న బోజై ఫంక్షన్ హాల్ సమీపంలోని యూ-టర్న్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన పండ్ల బండ్ల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, ముఖ్యంగా యూ-టర్న్ వద్ద తరచూ ట్రాఫిక్ జామ్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో అక్కడ ఏర్పాటు చేసిన పండ్ల బండ్లను పోలీసులు తొలగించారు. ప్రస్తుతం యూ-టర్న్ వద్ద ఎలాంటి పండ్ల బండ్లు లేకపోవడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాన రోడ్లపై ఇకపై ఈ ప్రాంతంలో ఎవరూ పండ్ల, ఇతరత్రా బండ్లు ఏర్పాటు చేయడానికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. రహదారిపై పండ్ల బండ్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోందని తెలిపారు. వాహనదారులు, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నిత్యం ట్రాఫిక్ తనిఖీలు నిర్వహిస్తూ బోజై ఫంక్షన్ హాల్ సమీపంలోని యూ-టర్న్ ప్రాంతంలో ఇకపై నిత్యం ట్రాఫిక్ తనిఖీలు నిర్వహిస్తామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. రహదారిపై అక్రమంగా బండ్లు ఏర్పాటు చేయడం, వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివే యడం వంటి చర్యలకు అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ఈ చర్యతో రాజుకాలనీ ప్రధాన రహదారి యూ-టర్న్ వద్ద వాహనాల రాకపోకలకు మరింత వెసులుబాటు కలగడంతో పాటు, ట్రాఫిక్ తగ్గుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# లడ్డూ వేలంలో పాల్గొన్న కాలాపత్తర్ పోలీసులు

**33 వేలతో గణేశ్ లడ్డూను దక్కించుకున్న పోలీస్ బృందం**



హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్) పోలీస్--ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు కమ్యూనిటీ పోలీసింగ్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో కాలాపత్తర్ పోలీసులు వినాయక లడ్డూ వేలంలో పాల్గొన్నారు. కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోచీ కాలనీలో మహేష్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో పోలీస్ బృందం పాల్గొని ?33,000 సమర్పించి లడ్డూను దక్కించుకుంది. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, ఐపీఎస్., పాతబస్తీ ఫలక్‌నుమా ఏసీపీ ఎం.ఎ. జావేద్ మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పోలీసుల భాగస్వామ్యంతో స్థానిక ప్రజలు, యువతతో సత్సంబంధాలు పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ప్రజా విశ్వాసాన్ని బలోపేతం చేయడంతో పాటు 'ఫ్రెండ్లీ పోలీసింగ్', 'కమ్యూనిటీ పోలీసింగ్'కు ప్రాధాన్యతనిస్తూ పోలీసులు ప్రజలతో కలిసి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కాలాపత్తర్ ఎస్‌హెచ్‌ఓ, డీఐతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి నిమజ్జన ఏర్పాట్లపై సీపీ సుమతి పర్యవేక్షణ







మల్కాజ్‌గిరి కమిషనరేట్: క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్) గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సమగ్ర నిఘా వ్యవస్థ ద్వారా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన ప్రాంతాలు, చెరువుల వద్ద సుమారు 500 సీసీ కెమెరాలు, ప్రధాన రహదారుల్లో ఎల్అండ్‌టీ, నిర్భయ, కమ్యూనిటీ సీసీ కెమెరా నెట్ వర్క్‌ల ద్వారా 5000 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రియల్‌టైమ్ నిఘా కొనసాగిస్తున్నారు. అదనంగా టీజీక్వెస్ట్‌కు చెందిన 3 డ్రోన్ల ద్వారా కూడా పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. భక్తుల రద్దీని నియంత్రించడం, ప్రజల భద్రత, ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపట్టడంతో పాటు వివిధ విభాగాల మధ్య సమన్వయంతో నిమజ్జన ప్రక్రియను సురక్షితంగా పూర్తి చేసేందుకు సమగ్ర ఏర్పాట్లు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# దోమలో ఘనంగా పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి



**దోమ, సెప్టెంబర్ :** భారతీయ జనతా పార్టీ సిద్ధాంతకర్త, మార్గదర్శకుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను దోమ మండల కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ?ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొంగు మల్లేశం మాట్లాడుతూ, అంత్యోదయ సూత్రంతో సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలని దీన్ దయాళ్ ఆశించారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ?దేశ ప్రగతికి ఆయన అందించిన సేవలను, అనుసరించిన సిద్ధాంతాలను ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. సమాజంలో బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన జీవితాంతం పనిచేశారని పేర్కొన్నారు. యువత, కార్యకర్తలు ఆయన మార్గదర్శకాలను జీవితంలో ఆచరించాలని కోరారు. ?ఈ కార్య క్రమంలో పలువురు స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెచ్చులూడుతున్న పైకప్పు.. పిల్లలకు పొంచిన ముప్పు!

- శిథిలావస్థకు చేరిన కైలాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది ఆందోళన
- కొత్త భవనానికి నిధులు మంజూరు చేయిస్తానన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్




**ఆదిలాబాద్, సెప్టెంబర్ 25**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరి చిన్నారులకు ప్రమాదకరంగా మారింది. భవనం పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంగన్‌వాడీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను అంగన్‌వాడీ టీచర్, ఆయాలు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రం పరిస్థితిని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని, నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అం గన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆదినాథ్, బీజేపీ నాయకులు, , కైలాష్‌నగర్ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బెజ్జూరులో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**కొమరం భీం, సెప్టెంబర్ 25 :** బెజ్జూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆదేశాల మేరకు బీజేపీ నాయకులు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, మాజీ సర్పంచులు వసీవుల్లా ఖాన్, రాకేష్, కిష్టయ్య, జాడి దిగంబర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క)













**(లక్ష్మీదేవి పేట) ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)**

శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు బండి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించినటువంటి కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ, వెంకటాపూర్ మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించిన వారికి శుభాకాంక్షలు తెలిపి అలాగే వారిని శాలువాతో సత్కరించిన మంత్రి సీతక్క , రానున్న ఎన్నికలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని వారు చెప్పారు,,, వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులను చేపడుతూ ప్రజల అభ్యున్నతికి ప్రతి గ్రామానికి అన్ని విధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని వారు సూచించారు,,, పార్టీ కోసం కార్యకర్తలు ఎల్లవేళలా పార్టీ అభ్యున్నతికి గెలుపుకు కృషి చేయాలని వారు కొనియాడారు,,, ప్రతి గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయాలని వారు చెప్పారు,,,, కాంగ్రెస్ పార్టీ చేసే అభివృద్ధి పనులను ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు కుట్ర పూరిత చర్యలు సోషల్ మీడియాలో ప్రజలను మబ్బ పెట్టే దిశగా అడుగులు వేస్తున్నారు,, వారికి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి తోనే సాధ్యమవుతుందని ఈ కార్యక్రమంలో భాగంగా వారు తెలిపారు, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేస్తూ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులను వివరించాలని మంత్రి సీతక్క తెలిపారు పదేళ్లలో చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ చేసి చూపిస్తుందని వారు తెలిపారు,,,, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ప్రజలకు వివరించారుఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీ రాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవి యాదవ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టేకోళ్ళ వెంకటేష్ యాదవ్,రామప్ప ఆలయ కమిటీ చైర్మన్ మిలుకూరి ఐలయ్య, పి ఎ సి ఎస్ చైర్మన్ మాడుగుల రమేష్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మూడ్ వీరేశ్ నాయక్,మండల సీనియర్ నాయకులు,అనుబంధ సంఘాల నాయకులు,మహిళా నాయకులు,యూత్ నాయకులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# జోకినోళ్ళకే పదవులు..?

- సెటిల్మెంట్ చేసెటోళ్లకే ప్రాధాన్యత!
- ఇష్టారాజ్యంగా కాంగ్రెస్ గ్రామ కమిటీల ఏర్పాటు
- మండల అధ్యక్షుడి తీరుపై అసంతృప్తి



**(వెంకటాపూర్ )ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)**

వెంకటాపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల నియామకం తీవ్ర దుమారాన్ని రేపుతోంది. మండల పార్టీ అధ్యక్షుడు తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీని తన సొంత జాగీరుగా మార్చుకున్నారనే విమర్శలు పార్టీ శ్రేణుల నుంచే వెల్లువెత్తుతున్నాయి. నిజమైన కార్యకర్తలను పక్కనపెట్టి తనకు అనుకూలంగా ఉన్నవారికే పదవులు కట్టబెడుతున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

**జోకినోళ్ళకే పదవులు**

గ్రామ కమిటీల నియామకంలో అర్హత, సీనియారిటీ, పార్టీ కోసం చేసిన సేవలను పూర్తిగా పక్కనపెట్టారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల అధ్యక్షుడి చుట్టూ తిరుగుతూ, భజన చేసే వారికే గ్రామ అధ్యక్ష పదవులు దక్కుతున్నాయని ఆరోపిస్తున్నారు. సంవత్సరాల తరబడి పార్టీ జెండా మోసిన సీనియర్లకు కనీసం కమిటీలో సభ్యుడిగా కూడా చోటు దక్కడం లేదని వాపోతున్నారు.

**- సెటిల్మెంట్ చేసేటోళ్లకే ప్రాధాన్యత**

ఇక గ్రమాల్లో భూ వివాదాలు, ఇతర సెటిల్మెంట్లు తీసుకొచ్చి ఇచ్చేవారికి, ఆర్థికంగా సహకరించేవారికే మండల అధ్యక్షుడు పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సెటిల్మెంట్ల ద్వారా వచ్చే ఆదాయంలో వాటా కోసమే ఇలాంటి వారికి పదవులు ఇస్తున్నారని, దీంతో పార్టీ ప్రతిష్ట మసకబారుతోందని సీనియర్ నాయకులు చెబుతున్నారు. నిజమైన, నిబద్ధత కలిగిన కార్యకర్తలను పక్కన పెట్టడం వల్ల భవిష్యత్తులో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

**- పరామర్శల్లో రాజకీయం**

మండల అధ్యక్షుడి తీరు పరామర్శల విషయంలో కూడా దారుణంగా ఉందని కార్యకర్తలు మండిపడుతున్నారు. పార్టీ కార్యకర్తల కుటుంబాల్లో ఎవరైనా మరణించినా, అనారోగ్యంతో బాధపడుతున్నా జిల్లా నాయకులు, మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరామర్శ చేయించాల్సిన బాధ్యత మండల అధ్యక్షుడిపై ఉంటుంది. కానీ ఆయన తన వర్గానికి చెందిన కుటుంబాలకు మాత్రమే సమాచారం ఇచ్చి పరామర్శలు చేయిస్తున్నారని, తనకు వ్యతిరేకంగా ఉన్నవారి ఇంటికి జిల్లా నాయకులు, మంత్రి వెళ్లకుండా అడ్డుపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

**- గెలిచింది ఒకరైతే ప్రకటించింది మరొకరిని**

తాజాగా జరిగిన గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నికల్లో అత్యంత అవకతవకలు జరిగాయని తెలుస్తోంది. ఒక గ్రామంలో నిజంగా గెలిచిన వ్యక్తిని పక్కనపెట్టి, కేవలం మండల అధ్యక్షుడికి అనుకూలంగా ఉన్నాడనే కారణంతో ఓడిపోయిన వ్యక్తిని గెలిచినట్లు ప్రకటించారని బాధితులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. దీనికి సంబంధించిన ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయని చెబుతున్నారు.

మొత్తంగా మండల అధ్యక్షుడి ఏకపక్ష నిర్ణయాలు, పెత్తనం వల్ల వెంకటాపూర్ మండల కాంగ్రెస్ లో గ్రూపు విభేదాలు భగ్గుమంటున్నాయి. పార్టీ అధికారంలో ఉన్న సమయంలోనే ఇలా కార్యకర్తలను పట్టించుకోకపోతే భవిష్యత్తులో పార్టీకి నష్టం జరుగుతుందని నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా నాయకత్వం, మంత్రి జోక్యం చేసుకుని గ్రామ కమిటీల నియామకంపై విచారణ జరిపి, అర్హులైన వారికి పదవులు ఇచ్చి న్యాయం చేయాలని పార్టీ శ్రేణులు డిమాండ్ చేస్తున్నారు.

# హైదరాబాద్ వేదికగా ప్రపంచ రియల్ ఎస్టేట్ దిగ్గజాల సమాగమం

**- తొలిసారిగా భారత్‌లో ఐఆర్ఈసీ 2026..**
**- 35కిపైగా దేశాల నుంచి 2,000 మందికి పైగా ప్రతినిధులు**




**హైదరాబాద్ : ప్రతినిధి శ్రవణ్ కుమార్ సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)**
ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ మరో కీలక ఘట్టానికి వేదికగా నిలిచింది. భారతదేశంలో తొలిసారిగా నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ (ఐఆర్ఈసీ) 2026 శుక్రవారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమైంది. "ది డోర్ టు వాట్ హాపెన్స్ నెక్స్ట్" అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ మూడు రోజుల అంతర్జాతీయ సదస్సుకు 35కిపైగా దేశాల నుంచి 2,000 మందికి పైగా రియల్ ఎస్టేట్ రంగ ప్రముఖులు, 75 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 100కిపైగా ఎగ్జిబిటర్లు, సాంకేతిక సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారు. ఈ సదస్సుకు నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ (నార్) అధ్యక్షుడు కెవిన్ బ్రౌన్తో పాట ు ప్రపంచవ్యాప్తంగా ఉన్న రియల్టర్లు, డెవలపర్లు, బ్రోకరేజ్ సంస్థల ప్రతినిధులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, విధాన నిర్ణేతలు, ప్రాప్‌టెక్ సంస్థల వ్యవస్థాపకులు, సాంకేతిక రంగ నిపుణులు హాజరవుతున్నారు. దీంతో హైదరాబాద్‌లో జరుగుతున్న ఐఆర్ఈసీ 2026 అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ రంగంలో ప్రత్యేక దృష్టిని ఆకర్షిస్తోంది. నార్-ఇండియా ఆధ్వర్యంలో.. హెచ్ఆర్ఏ నిర్వహణలోఐఆర్ఈసీ 2026 నిర్వహణ బాధ్యతలను నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్-ఇండియా చేపట్టగా, హైదరాబాద్‌లో కార్యక్రమ నిర్వహణను హైదరాబాద్ రియల్టర్స్ అసోసియేషన్ నిర్వహిస్తోంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో స్ట్రాటజిక్ కాన్ఫరెన్స్, ఇన్నోవేషన్ షోకేస్, లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రభావితం చేస్తున్న అంతర్జాతీయ పెట్టుబడులు, కృత్రిమ మేధస్సు, ప్రాప్‌టెక్, డీప్‌టెక్, సుస్థిర అభివృద్ధి, భవిష్యత్ నగరాలు, బ్రాండెడ్ నివాసాలు, కార్యాలయాల మార్పులు, రియల్ ఎస్టేట్ టోకెనైజేషన్ తదితర అంశాలపై అంతర్జాతీయ నిపుణులు చర్చించనున్నారు. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ గేట్‌వే సాంకేతిక, సేవల రంగాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ విస్తరణ, అంతర్జాతీయ అనుసంధానం వంటి అంశాలతో వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌ను ఐఆర్ఈసీకి వేదికగా ఎంపిక చేయడం ద్వారా నగరానికి అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ వేదికపై మరింత ప్రాధాన్యం లభించింది. నార్-ఇండియా చైర్మన్ సుమంత్ రెడ్డి అరని మాట్లాడుతూ, భారతీయ రియల్ ఎస్టేట్ రంగానికి ఐఆర్ఈసీ 2026 ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. భారతీయ డెవలపర్లు, వృత్తి నిపుణులు, ప్రాజెక్టులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఎదుగుతున్న నేపథ్యంలో ప్రపంచ మార్కెట్లతో మరింత బలమైన అనుసంధానం అవసరమని పేర్కొన్నారు. ఐఆర్ఈసీ 2026 చైర్ శైలేందర్ సింగ్ మాట్లాడుతూ, సాంకేతికత, పెట్టుబడులు, సుస్థిరత, మారుతున్న వినియోగదారుల అభిరుచులు, పట్టణ అభివృద్ధిలో వస్తున్న మార్పులపై ప్రపంచస్థాయి చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని తెలిపారు.మూడు వేదికలు.. విస్తృత అవకాశాలు సెప్టెంబర్ 26, 27 తేదీల్లో జరిగే స్ట్రాటజిక్ కాన్ఫరెన్స్‌లో ప్లీనరీలు, అంతర్జాతీయ ప్యానెల్ చర్చలు, సీఈఓల రౌండ్‌టేబుల్ సమావేశాలు, కీలక ప్రసంగాలతో పాటు 30కిపైగా బ్రేక్‌అవుట్ సెషన్లు నిర్వహించనున్నారు. ఇన్నోవేషన్ షోకేస్‌లో 100కిపైగా సాంకేతిక సంస్థలు పాల్గొని ఏఐ, డేటా ఇంటెలిజెన్స్, స్మార్ట్ మౌలిక సదుపాయాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు వంటి సాంకేతికతలు రియల్ ఎస్టేట్ రంగాన్ని ఎలా మారుస్తున్నాయో ప్రదర్శించనున్నాయి. అదేవిధంగా సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు జరిగే లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పోలో హైదరాబాద్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలోని వివిధ రియల్ ఎస్టేట్




అవకాశాలను ప్రదర్శించనున్నారు. చర్చలకే పరిమితం కాకుండా.. వ్యాపార అవకాశాలకు వేదికఐఆర్ఈసీ 2026లో అంతర్జాతీయ నెట్‌వర్కింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు. నెట్‌వర్కింగ్ లాంజ్‌లు, డీల్ జోన్‌లు, పరస్పర సమావేశాలు, యాప్ ఆధారిత ప్రతినిధుల నెట్‌వర్క్ ద్వారా పెట్టుబడిదారులు, డెవలపర్లు, రియల్టర్లు, సాంకేతిక సంస్థలు నేరుగా పరస్పరం కలుసుకునే అవకాశం కల్పించారు. ఎంఎస్ఎన్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి నగరాల నిర్మాణం, పెరుగుతున్న ఆకాంక్షలకు అనుగుణమైన అభివృద్ధి ప్రాజెక్టుల్లో హైదరాబాద్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ప్రపంచ రియల్ ఎస్టేట్ చర్చలుసెప్టెంబర్ 25న కర్టెన్ రైజర్‌తో ప్రారంభమైన కార్యక్రమాల్లో భాగంగా సెప్టెంబర్ 26, 27 తేదీల్లో స్ట్రాటజిక్ కాన్ఫరెన్స్, ఇన్నోవేషన్ షోకేస్, సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు లగ్జరీ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 26న ఐఆర్ఈసీ గాలా నైట్ కూడా జరగనుంది. మొత్తంగా 35కిపైగా దేశాల ప్రతినిధులు ఒకే వేదికపైకి రావడం, అంతర్జాతీయ పెట్టుబడిదారులు భారతీయ డెవలపర్ల మధ్య నెట్‌వర్కింగ్‌కు అవకాశం ఏర్పడటం, ఏఐ--ప్రాప్‌టెక్ వంటి ఆధునిక సాంకేతికతలపై చర్చలు జరగడం ఐఆర్ఈసీ 2026 ప్రత్యేకతగా నిలుస్తోంది. దీంతో సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు హైదరాబాద్ ప్రపంచ రియల్ ఎస్టేట్ రంగంలోని ఆలోచనలు, పెట్టుబడులు, సాంకేతికత, భవిష్యత్ నగరాలపై చర్చలకు అంతర్జాతీయ వేదికగా మారనుంది.

# విఘ్నేశ్వరుని నిమజ్జన ప్రారంభ పూజలో ఎమ్మెల్సీ దండే విఠల్



**కొమరం బీం, సెప్టెంబర్ 25**
కాగజ్‌నగర్ పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని నిమజ్జన ప్రారంభ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ముఖ్య అతిథిగా హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమం ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష్ చౌదరి, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను నిర్వాహకులు చేపట్టారు.

# మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన




**నర్సంపేట, సెప్టెంబర్ 25():** విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు నర్సంపేట ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలో మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీలత విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణ, భావోద్వేగ సమతుల్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షల సమయంలో ఎదురయ్యే ఒత్తిడి, ఆందోళన, తోటి విద్యార్థుల ప్రభావం వంటి సమస్యలను అధిగమించేందుకు అనుసరించాల్సిన మార్గాలను వివరించారు.విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, తమ సమస్యలను మనసులో దాచుకోకుండా అవసరమైన సమయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నిపుణుల సహాయం తీసుకోవాలని డాక్టర్ శ్రీలత సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు

**-ఎన్టీపీసీ ఏరియాలోని బ్యాంక్ శాఖల్లో కరపత్రాల పంపిణీ**
**- వారానికి 5 రోజుల పనిదినాలు, పీఎల్ఐ వివక్షను తొలగించాలని డిమాండ్**



**రామగుండం ఎన్టీపీసి : సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్**
దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో నిర్వహించనున్న మూడు రోజుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. మద్దతు ప్రచారంలో భాగంగా శుక్రవారం ఎన్టీపీసీ ఏరియాలోని ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల్లో సీఐటీయూ నాయకులు, బ్యాంకు సిబ్బందికి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి మాట్లాడుతూ.. బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 5 రోజుల పని విధానం: బ్యాంకు సిబ్బందికి వారానికి ఐదు రోజుల పని విధానాన్ని తక్షణమే అమలు చేయాలి. ప్రొడక్టివిటీ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం అమలులో చూపుతున్న వివక్షను తొలగించాలి. వేతన ఒప్పంద పరిష్కారం 12వ వేతన ఒప్పందంలోని మిగిలిన డిమాండ్లను ఆమోదించాలి.
ప్రభుత్వ రంగ బ్యాంకింగ్‌ను కాపాడుకుందాం:
దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని బిక్షపతి కోరారు. బ్యాంకుల విలీనాలు, ప్రైవేటీకరణ ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పాటైన ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు (==దీ) రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల హక్కుల సాధనతో పాటు, సార్వజనిక బ్యాంకింగ్ రంగాన్ని కాపాడుకోవడానికి జరుగుతున్న ఈ సమ్మెకు కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎం. రామాచారి తదితర నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# మన్ కీ బాత్ నల్లబెల్లి మండల కన్వీనర్‌గా ధర్మారం క్రాంతికుమార్




**నల్లబెల్లి, సెప్టెంబర్ 25** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నల్లబెల్లి మండలంలో ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లేందుకు ధర్మారం క్రాంతికుమార్‌ను మండల కన్వీనర్‌గా నియమించినట్లు బీజేపీ నల్లబెల్లి మండల పార్టీ అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ తెలిపారు. ప్రతి నెల ప్రధానమంత్రి దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి బూత్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించేలా క్రాంతికుమార్ సమన్వయం చేయాలని ఆయన సూచించారు. ప్రధాని మోదీ ఆలోచనలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దేశ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో 'మన్ కీ బాత్' కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని తడుక వినయ్ గౌడ్ పేర్కొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఏఐఎస్ఎఫ్

**90వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను జయప్రదం చేయండి**
**వనపర్తి : సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)**
అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలు ఈ నెల 28, 29, 30 తేదీల్లో హనుమకొండలో నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జ రమేష్, మాజీ రాష్ట్ర నాయకులు శివ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ముగింపు ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను వారి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమాల వేగుచుక్కగా ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విద్యార్థులను సమీకరించడంలో ఏఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంతో పాటు ప్రత్యేక తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ విద్యార్థుల తరఫున ఉద్యమాలు నిర్వహించిందన్నారుస్వాతంత్ర్యానంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం, సాంఘిక సంక్షేమ హాస్టళ్ల ఏర్పాటు, మెస్ ఛార్జీల పెంపు, ప్రభుత్వ విద్య పరిరక్షణ తదితర అంశాలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని, విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని, అన్ని ప్రభుత్వ కళాశాలల్లో ఎన్‌సీసీ ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవ ముగింపు ఉత్సవాలను విజయవంతం చేయాలని విద్యార్థులకు వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, నాయకులు ఉదయ్, ప్రశాంత్, రామ్ చరణ్, ప్రణీత్, నవీన్, వర్షిత్, సందీప్‌తో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.




# రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కాసిపేట గురుకుల విద్యార్థులు




**బెల్లంపల్లి,సెప్టెంబర్ 25):** మందమర్రి సెవెన్ ఆఫ్ హోప్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్--19 ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాసిపేట విద్యార్థులు ఎం. విగ్నేశ్వర్, జి. కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వూటూరి సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్రస్థాయిలోనూ ఇదే క్రీడాస్ఫూర్తితో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీడీ కె. హరిష్, పీఈటీ ఎ. రాజేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు స్ఫూర్తిదాయకం

**- గోదావరిఖని బీఎంఎస్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు**

**హాజరైన ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్**





**రామగుండం ఎన్టీపీసీ, సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు, ఏకాత్మ మానవతావాద సిద్ధాంతకర్త పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గోదావరిఖని బీఎంఎస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్. కుమార్ మాట్లాడుతూ.. దేశానికి దీన్‌దయాళ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ఆయన ప్రతిపాదించిన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయ సిద్ధాంతాలు భారతీయ ఆలోచనా విధానంలో కీలకమైనవని పేర్కొన్నారు. సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి సైతం అభివృద్ధి ఫలాలు అందాలనే ఆయన ఆలోచనలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు సాగాలని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల అధ్యక్షుడు గుండెబోయిన భూమయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, సింగరేణి కోల్ మైన్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుల్వ లక్ష్మీనారాయణ, పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సుల్వ పద్మ, నాయకులు అందె రాజకుమార్, బుంగ మహేష్, పుప్పాల కుమార్, వేల్పూరి రాజయ్య, బూడిద హర్ష, నడిగొట్టు రాజేందర్, ఆంజనేయులు, శంభోజు సురేష్, ఆకునూరి రమేష్, తిరుపతి, కే. సంపత్ పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ పోలీస్

**- జాతీయస్థాయిలో ఈగల్ ఫోర్స్ సత్తా.. 10 అంశాల్లో 6 విభాగాల్లో ముందంజ**

**- యువతను కాపాడుకోవడం మనందరి బాధ్యత: డీజీపీ సి.వి. ఆనంద్**







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్ )** డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని డీజీపీ సి.వి. ఆనంద్ అభినందించారు. సెప్టెంబర్ 22, 23 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి యాంటీ నార్కోటిక్స్ అధిపతుల సమావేశంలో వెల్లడైన పనితీరు వివరాల ప్రకారం 10 కీలక అంశాల్లో ఆరు విభాగాల్లో తెలంగాణ పోలీసులు ముందంజలో నిలిచారని తెలిపారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర అధికారులు, సిబ్బందితో డీజీపీ సమావేశమై డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, పనితీరును సమీక్షించారు. డ్రగ్స్ కారణంగా యువత, సమాజ భవిష్యత్తుకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని డీజీపీ పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీసులు చేపడుతున్న చర్యలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం పోలీసులకు పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు. 'నషాముక్తి తెలంగాణ--నషాముక్తి భారత్' లక్ష్యంతో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

**అరెస్టుల్లో జాతీయ సగటు కంటే ఎక్కువ.**

డ్రగ్స్ కేసుల్లో అరెస్టుల విషయంలో తెలంగాణ పోలీసులు గణనీయమైన పనితీరు కనబరిచారని అధికారులు డీజీపీకి వివరించారు. జాతీయస్థాయిలో ఒక్కో కేసుకు సగటున 1.3 మంది అరెస్టు చేస్తుండగా, తెలంగాణలో ఆ సంఖ్య 3.7గా ఉందని తెలిపారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు చేసి సంబంధిత వ్యక్తులపై సమగ్రంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

**అక్రమ ఆస్తులపై చర్యలు.**

డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలతో సంబంధం ఉన్న వ్యక్తుల ఆస్తులను చట్టప్రకారం స్వాధీనం చేసుకోవడంలోనూ తెలంగాణ పోలీసులు ముందున్నారని అధికారులు తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68ఎఫ్ కింద డ్రగ్స్ అక్రమ కార్యకలాపాలతో ముడిపడిన ఆస్తులపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. డ్రగ్స్ బారిన పడే అవకాశం ఉన్న యువత, మైనర్లను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

**అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై నిఘా.**

తెలంగాణ ఈగల్ ఫోర్స్ డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలను ఛేదించేందుకు రాష్ట్ర సరిహద్దులు దాటి దర్యాప్తు చేపడుతోందని అధికారులు వివరించారు. థాయిలాండ్, గోవా, ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లి డ్రగ్స్ సరఫరా, రవాణా వ్యవస్థపై ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిన డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

డార్క్‌వెబ్‌పైనా ప్రత్యేక నిఘా.

డార్క్‌వెబ్ కార్యకలాపాలపై విశ్లేషణ చేపట్టి డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న నెట్‌వర్క్‌లను గుర్తించడంలో ఈగల్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించిందని అధికారులు తెలిపారు. డార్క్‌వెబ్ ద్వారా జరుగుతున్న అక్రమ లావాదేవీలను గుర్తించి భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సుమారు 500 కిలోలకు పైగా డ్రగ్స్‌కు సంబంధించిన 15కుపైగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

**ఆరు అంశాల్లో జాతీయస్థాయిలో ముందంజ.**

డ్రగ్స్ నియంత్రణలో ఉత్తమ నిర్మాణం, కేసుల్లో అరెస్టులు, ఆస్తుల స్వాధీనం, అంతర్జాతీయ స్థాయి దర్యాప్తు, డార్క్‌వెబ్ విశ్లేషణ, భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం వంటి ఆరు అంశాల్లో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో ముందంజలో ఉన్నారని డీజీపీ తెలిపారు. మిగిలిన అంశాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించాలి. డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటివరకు సాధించిన ఫలితాలతో సంతృప్తి చెందకుండా మిగిలిన అంశాల్లోనూ మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని డీజీపీ సూచించారు. భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు. "యువతను కాపాడుకుంటేనే తెలంగాణ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. నషాముక్తి తెలంగాణ, నషాముక్తి భారత్ లక్ష్యంగా మనందరం సమష్టిగా పనిచేయాలి. డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపేలా మరింత చేద్దాం" అని డీజీపీ సి.వి. ఆనంద్ పిలుపునిచ్చారు.

# మృతుల కుటుంబాలకు పరామర్శ

**జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్**



**టేకుమట్ల.సెప్టెంబర్ 25 (మన విశ్వం)** టేకుమట్ల మండలంలోని రామకృష్ణపూర్ (వి) గ్రామానికి చెందిన లద్దునూరి సమ్మక్క,ఎంపేడు గ్రామానికి చెందిన బొల్లి రాజయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను జిల్లా కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్,మాతృశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దొంతుల శ్రీనివాస్ మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి మనో ధైర్యాన్ని అందించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాతృశ్రీ ఫౌండేషన్ తరఫున ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం బస్తాను అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని దొంతుల శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాఘవాపూర్ సర్పంచ్ అంబాల కిరణ్,మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లద్దునూరి ఐలయ్య,జిల్లా ఎస్సీ సెల్ నాయకులు ఆరకొండ రాజయ్య,మండల ఎస్సీ సెల్ నాయకులు పారణంది రాములు తదితరులు ఉన్నారు.

# గ్రామస్తుల కోలాహలం మధ్య ముగిసిన గణనాథుల నిమజ్జనం



**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 25**మండల పరిధిలోని బెల్తరోడ గ్రామంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమం అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతిష్టించిన మహాత్మ యూత్ మరియు వాయుసేన యూత్ గణేష్ విగ్రహాలను శోభాయాత్రతో ఊరేగించి, వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ నిమజ్జన శోభాయాత్రను విజయవంతం చేయడంలో యూత్ సభ్యులు కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులైన రాజు, ఉమేష్, శంకర్, మహేష్, యోగేష్, సురేష్, డి.రవి, లక్ష్మణ్, మల్లేష్, కే.రవి, కృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొని నిమజ్జన మహోత్సవాన్ని దిగ్విజయం చేశారు. భక్తుల కోలాహలం, జై బోలో గణేష్ మహారాజ్ కీ జై అనే నినాదాల మధ్య నిమజ్జన వేడుకలు ఘనంగా ముగిశాయి.

# రూ.3.11 లక్షలకు వినాయక లడ్డూ



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 25:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం మహాదేవపురం డివిజన్ పరిధిలోని మోక్షిత్ హిల్ వ్యూ కాలనీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కాలనీ అధ్యక్షుడు పల్లి నరేష్ కుమార్ రెడ్డి రూ. 3.11 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో మహాదేవపురం 277 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, సోమిరెడ్డి, రామనాయుడు, చంద్రశేఖర్, శ్రీధర్ గౌడ్, నర్సిరెడ్డి, కమలాకర్ రెడ్డి, గణేష్‌తో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే పిల్లల సంపూర్ణ ఎదుగుదల



**టేకుమట్ల.సెప్టెంబర్ 25** టేకుమట్ల మండలంలోని వెలిశాల సెక్టార్ పరిధిలోని వెంకట్రావుపల్లి (బి) అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ మాధవి ఆధ్వర్యంలో 9వ పోషణ మాస కార్యక్రమాన్ని ఈ ఏడాది పోషణ మాసం థీమ్ మన అంగన్వాడి--మన బాధ్యతగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పెరుమాండ్ల చంద్రకళ హాజరై మాట్లాడుతూ తల్లులకు,పిల్లలకు పోషణ చాలా అవసరం అని పిల్లలు వయసుకు తగ్గ బరువు,ఎత్తుకు తగిన బరువు కలిగి ఉన్నప్పుడే శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు గుడ్లు,ఆకుకూరలు,పండ్లు, చిరుధాన్యాలు,పప్పు దినుసులు ఎక్కువగా అందించాలని తల్లులకు, గర్భిణీలకు,బాలింతలకు సూచించారు. గర్భిణీలు గర్భధారణ సమయంలో సీజన్‌లో లభించే ఆకుకూరలు, కూరగాయలు,పండ్లు తీసుకోవాలని సూచించారు. పోషకాహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు,పిల్లలు, అంగన్వాడీ టీచర్ భాగ్యలక్ష్మి,ఆశా వర్కర్ శారద,ఆయా కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఎంజీఎం సమస్యలపై ప్రశ్నిస్తే పోలీసుల దాడులా?

- ప్రజాగొంతుకను అణచివేయడం ఆపాలి
- వినయ్ భాస్కర్‌పై ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- ఎంజీఎం భవనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలి
- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు అర్షం మధుకర్



**ఆత్మకూరు, సెప్టెంబర్ 25**

వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో పెచ్చులూడి రోగులు గాయపడిన ఘటనపై ప్రశ్నించేందుకు, బాధితుల ను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేశారని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు అర్షం మధుకర్ ఆరోపించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేసే ధోరణి సరికాదన్నారు. శుక్రవారం తన స్వగృహంలో విడుదల చేసిన ప్రకటనలో మధుకర్ మాట్లాడుతూ, వినయ్ భాస్కర్‌ను పోలీసులు అడ్డుకోవడంతో పాటు దాడి చేశారని ఆరోపించారు. ఎంజీఎంలో రోగుల భద్రతపై ప్రశ్నించడం తప్పా? ఆస్పత్రి భవనాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎంజీఎం భవనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలని, అవసరమైన మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, భద్రతతో పాటు నాణ్యమైన ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎప్పుడు ప్రారంభిస్తారు? వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో ప్రజలకు ఎప్పుడు అందుబాటులోకి తీసుకొస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని మధుకర్ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టామని పేర్కొంటూ, ప్రస్తుత ప్రభుత్వం పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వినయ్ భాస్కర్‌కు సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను లేవనెత్తేవారిని అడ్డుకోవడం కంటే వాటికి పరిష్కారం చూపడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని మధుకర్ కోరారు.

# ఐక్యత చాటిన తెలంగాణ.. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు.

- రాష్ట్రవ్యాప్తంగా 1.24 లక్షల విగ్రహాలు నమోదు.. 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తి
- 25 వేల మందికి పైగా పోలీసులతో
- బందోబస్తు.. శనివారం ఉదయం 10.30 గంటల్లోపు ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు







**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)**

రాష్ట్రవ్యాప్తంగా గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ పోర్టల్‌లో 1.24 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని తెలిపారు. గతేడాది 1.15 లక్షల విగ్రహాలు నమోదయ్యాయని, ఈసారి సంఖ్య పెరిగిందన్నారు. ప్రజా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3.5 నుంచి 4 లక్షల వరకు విగ్రహాలు ఉండే అవకాశం ఉందన్నారు.

**88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తి.**

శుక్రవారం ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని డీజీపీ తెలిపారు. మిగిలిన విగ్రహాల నిమజ్జన ప్రక్రియ శనివారం ఉదయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ హైదరాబాద్‌లో శోభాయాత్రలు మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని వివరించారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ కొంత ఆలస్యంగా కొనసాగుతోందన్నారు. హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనానికి తరలివస్తుండటంతో సమయం పడుతోందని తెలిపారు.

**25 వేల మందికి పైగా పోలీసులతో బందోబస్తు.**

హైదరాబాద్‌లో నిమజ్జనాల కోసం గత పది రోజులుగా 25 వేల మందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీజీపీ తెలిపారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్, కలెక్టర్ తదితరులతో కలిసి ఏరియల్ సర్వే ద్వారా పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల పరిధి విస్తరించడంతో విగ్రహాల తరలింపునకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**అదనపు బలగాల మోహరింపు.**

శాంతిభద్రతల పరిరక్షణ కోసం టీజీఎస్‌పీ, ఆర్‌ఏఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఆక్టోపస్ బలగాలను మోహరించినట్లు డీజీపీ తెలిపారు. డీజీపీ రిజర్వ్ నుంచి ఐదు కంపెనీలను కూడా అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ప్రధాన నిమజ్జన ప్రాంతాల్లో భారీగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ కేంద్రాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. క్రేన్లు, ఇతర అత్యవసర సేవలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

**13 మంది మృతి.. 26 మందికి గాయాలు.**

గణేష్ ఉత్సవాల సందర్భంగా గత పది రోజుల్లో 13 మంది మృతి చెందడం బాధాకరమని డీజీపీ అన్నారు. నిమజ్జన విధుల కోసం హైదరాబాద్‌కు వచ్చిన కొత్తగూడెం ఎస్సై వెంకన్న మృతి బాధాకరమన్నారు. సైబరాబాద్ పరిధిలోని పటాన్‌చెరులో ఆరుగురు మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. ఖైరతాబాద్‌లో శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఒకరు మృతి చెందగా, నిర్మల్‌లో గుండెపోటుతో ఒకరు మృతి చెందినట్లు వివరించారు. డీజే శబ్దాల కారణంగా కూడా కొందరు మృతి చెందినట్లు పేర్కొన్నారు. ప్రమాదాల్లో మొత్తం 26 మంది గాయపడగా, మల్కాజిగిరి పరిధిలో 17 మంది గాయపడినట్లు డీజీపీ తెలిపారు. ప్రజలు శబ్ద కాలుష్యాన్ని తగ్గించి నిబంధనలు పాటించాలని సూచించారు.

**శనివారం ఉదయం 10.30 గంటల్లోపు పూర్తి.**

హైదరాబాద్‌లో మిగిలిన విగ్రహాల నిమజ్జన ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీజీపీ తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల్లోపు నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లాల్లోనూ నిమజ్జనాలు దాదాపు పూర్తయ్యాయని, నల్గొండ, నిర్మల్ తదితర ప్రాంతాల్లో మరికొంత సమయం పట్టే అవకాశం ఉందన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణను పోలీసులు ఆరు దశలుగా విభజించుకున్నారని, చివరి దశగా ప్రతి ఒక్కరూ నిమజ్జనం పూర్తి చేసుకుని సురక్షితంగా ఇంటికి చేరే వరకు పోలీసుల విధులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

**తెలంగాణ ఐక్యతకు నిదర్శనం.**

గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరగడం తెలంగాణ ప్రజల ఐక్యత, సోదరభావానికి నిదర్శనమని డీజీపీ అన్నారు. తెలంగాణలో అన్ని మతాల ప్రజలు సమైక్యంగా, సోదరభావంతో జీవిస్తున్నారని తెలిపారు. భైంసాలో ముస్లిం సోదరులు 'హిందూ--ముస్లిం భాయ్‌భాయ్' అంటూ గణేష్ ఉత్సవాల్లో పాల్గొనడం దీనికి నిదర్శనమన్నారు.

**పోలీసులకు సహకరించాలి.**

నిమజ్జనానికి వచ్చే విగ్రహాలను ఆలస్యం చేయకుండా పోలీసుల సూచనలకు అనుగుణంగా త్వరగా తరలించాలని డీజీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతోపాటు ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరేలా పోలీసులకు సహకరించాలని కోరారు

# మాచాపూర్ విద్యార్థినికి రూ.లక్ష ప్రోత్సాహకం!

**పదో తరగతి ప్రతిభకు శ్రీరామ్ లైఫ్ 'చదువుకో తెలంగాణ' పురస్కారం**

**నియోజకవర్గ టాపర్‌గా బోనగిరి నందినికి ఘన సత్కారం**






**ఎల్లారెడ్డి, సెప్టెంబర్25:** పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన మాచాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినికి అరుదైన గౌరవం దక్కింది. ఎల్లారెడ్డి మండలం మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన బోనగిరి అంజయ్య కుమార్తె బోనగిరి నందిని ఎల్లారెడ్డి నియోజకవర్గ టాపర్‌గా నిలిచి రూ.లక్ష ఉపకార వేతనం అందుకున్నారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చదువుకో తెలంగాణ' కార్యక్రమంలో భాగంగా గురువారం హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సంస్థ ప్రతినిధుల చేతుల మీదుగా నందిని ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 2025--26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాస్పరస్ జాకోబస్ హెండ్రిక్ క్రోమ్‌హౌట్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 632 మంది విద్యార్థులను ఎంపిక చేయగా, తొలి విడతలో 134 మందికి ఉపకార వేతనాలు అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర టాపర్‌కు రూ.5 లక్షలు, రెండో స్థానానికి రూ.3 లక్షలు, జిల్లా టాపర్లకు రూ.2 లక్షలు, నియోజకవర్గ టాపర్లకు రూ.లక్ష చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు మొత్తంగా రూ.2.2 కోట్ల ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ టాపర్‌గా నిలిచి రూ.లక్ష పురస్కారం అందుకున్న నందినిని గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

# సఫిల్‌గూడ చెరువు వద్ద పటిష్ట బందోబస్తు

**గణేష్ నిమజ్జన ఏర్పాట్లను సమీక్షించిన మల్కాజిగిరి సీపీ బి. సుమతి**









**మల్కాజ్‌గిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)**

గణేష్ నిమజ్జనం సందర్భంగా సఫిల్‌గూడ చెరువు వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి, ఐపీఎస్. సమీక్షించారు. నిమజ్జన ప్రాంతంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా, క్రేన్లు, బారికేడ్లు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులతో సీపీ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పోలీసు సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు పోలీసులకు సహకరిస్తూ సూచనలు పాటించాలని కోరారు.

# బైక్‌పై గణేశ్ శోభాయాత్ర మార్గాల పరిశీలన

**క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించిన హైదరాబాద్ సీపీ సజ్జనర్**











**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాలను హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్. ద్విచక్ర వాహనంపై స్వయంగా పర్యటించి పరిశీలించారు. శోభాయాత్ర ప్రశాంతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగేలా క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకునేందుకు ఆయన ఈ తనిఖీ చేపట్టారు.మోజంజాహి మార్కెట్, బషీర్‌బాగ్, లిబర్టీ తదితర ప్రధాన కూడళ్లలో పర్యటించిన సీపీ.. అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ఇతర ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలు సుకున్నారు. శోభాయాత్ర ఎక్కడా నిలిచిపోకుండా ముందుకు సాగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ట నిఘా కొనసా గించాలని, శోభాయాత్రకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విధుల్లో ఉన్న సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ స్పష్టం చేశారు.

# కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి గణేశ్ శోభాయాత్రపై నిఘా

**- అత్యంత ప్రశాంతంగా నిమజ్జనం..**
**తెల్లవారేసరికి ప్రక్రియ పూర్తి: సీపీ సజ్జనర్**






**హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** నగరంలో గణేశ్ నిమజ్జనోత్సవం తుది ఘట్టానికి చేరుకున్న నేపథ్యంలో తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ నుంచి హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్. నిమజ్జన ఏర్పాట్లు, శోభాయాత్ర మార్గాల్లో భద్రతా పరిస్థితులను పర్యవేక్షించారు.

బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లోని కంట్రోల్ రూమ్ నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి సీసీటీవీ దృశ్యాల ద్వారా శోభాయాత్రలు, ట్రాఫిక్ మళ్లింపులను సమీక్షించారు. నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన దాదాపు 10 వేల సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, ప్రత్యేక నిఘా వాహనాల లైవ్ ఫీడ్స్‌తో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు సీపీ తెలిపారు.ఖైరతాబాద్, బాలాపూర్ మహాగణపతుల శోభాయాత్రలతో పాటు పాతబస్తీ, రాజేంద్రనగర్, గోల్కొండ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాల తరలింపు ప్రశాంతంగా కొనసాగుతోందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.జియో ట్యాగింగ్ యాప్‌లో నమోదైన 14,850 విగ్రహాల్లో ఇప్పటికే సుమారు 10,300 విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, మిగిలిన విగ్రహాల నిమజ్జనాన్ని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో 30కి పైగా భారీ క్రేన్లతో పాటు అదనపు క్రేన్లు, బేబీ పాండ్స్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.తెలుగుతల్లి ఫ్లైఓవర్, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. నిమజ్జన విధుల్లో సేవలందిస్తున్న పోలీస్ సిబ్బందితో పాటు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల సేవలను సీపీ అభినందించారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల క్షేత్రస్థాయిలో సమస్యలను తక్షణమే పరిష్కరించగలుగుతున్నామని సీపీ తెలిపారు. టీజీ ఐసీసీసీ డైరెక్టర్ వి.బి. కమలాసన్ రెడ్డి, ఐపీఎస్., ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# వినాయక నిమజ్జన శోభాయాత్రపై ఏరియల్ సర్వే

**- హైదరాబాద్ నగరంలో కొనసాగుతున్న నిమజ్జన శోభాయాత్ర సరళి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**






**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** హైదరాబాద్ మహానగరంలో అత్యంత వైభవంగా కొనసాగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్రను నగర ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. శుక్రవారం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరిన మంత్రి.. హుస్సేన్‌సాగర్ పరిసరాలతో పాటు నగరంలోని ప్రధాన శోభాయాత్ర మార్గాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వినాయక విగ్రహాల ఊరేగింపు తీరు, భక్తుల రద్దీ, ట్రాఫిక్ సరళి, పోలీసుల బందోబస్తు, నిమజ్జన ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. శోభాయాత్ర ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సాగేలా అధికారులు చేపట్టిన చర్యలను పరిశీలించారు.ఈ ఏరియల్ సర్వేలో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితర పాల్గొన్నారు.

# రైతు రిజిస్ట్రేషన్, యూరియా బుకింగ్‌పై అవగాహన

**కోట్ల(కె)లో సదస్సు.. హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి సుజాత**



**ముధోల్(నిర్మల్ రూరల్), సెప్టెంబరు 25**
రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) సుజాత పేర్కొన్నారు.నిర్మల్ మండలం కోట్ల (కె) గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రైతు రిజిస్ట్రేషన్, యూరియా బుకింగ్ విధానాలపై రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రైతులు తమ వివరాలను సకాలంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనివల్ల ప్రభుత్వ పథకాలు నేరుగా అందుతాయని వివరించారు.అలాగే యూరియా కొరత లేకుండా ముందస్తుగా బుకింగ్ చేసుకునే విధానాన్ని రైతులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. అనంతరం గ్రామానికి విచ్చేసిన డీఏఓ సుజాతను గ్రామ సర్పంచ్ రాజు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఘు,మండల వ్యవసాయ అధికారి అంబాజీ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు స్థానిక రైతులు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పరిశీలన

**- క్షేత్రస్థాయిలో పురోగతిని పరిశీలించిన రాష్ట్ర ఉన్నతాధికారులు**
**- అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ సీపీ ఎన్. శ్వేత**



**వరంగల్, సెప్టెంబర్ 25 (:** వరంగల్ నగరంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించి పనుల స్థితిగతులను పరిశీలించారు.ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రవాణా, రోడ్లు-భవనాల శాఖకు చెందిన వికాస్ రాజ్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, సీఎంఓ కార్యదర్శి కె. మాణిక్ రాజ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఆసుపత్రి నిర్మాణ ప్రాంగణాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి సాదరంగా స్వాగతం పలికారు.

# ఘనంగా గణనాథుల నిమజ్జనం



**మక్తల్/మక్తల్ రూరల్/ నారాయణపేట క్రైం, సెప్టెం బరు 25 ():** మ క్తల్ పట్టణంలో 11 రోజులపాటు పూజలందుకున్న గణనాథులను శుక్రవారం భక్తిశ్రద్ధలతో స్థానిక పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. ప ట్టణంలో 50కి పైగా ఉన్న విగ్రహాలను ఆయా మండపాల నుంచి ఊరేగింపుగా తరలించారు. భజనలు, కోలాటం, దాండియా నృత్యాలతో అల రించారు. వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో ఆజాద్‌నగర్ చౌరస్తాలో స్వాగతవేదిక ఏర్పాటు చేశారు. బాలగంగాధర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ప్రతీ మండపం నిర్వాహకులను వీహెచ్‌పీ నాయకులు శాలువా, మెమెంటోతో సత్కరించారు. హాజరైన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నిమజ్జన వేడుకలు నిర్వహించాలన్నారు. పెద్ద చెరువు వద్ద క్రెయిన్ సహాయంతో గణనాథులను నిమజ్జనం చేశారు. అంతకుముందు ఆయా మండ పాల వద్ద లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో సీసీ కెమెరాల ని ఘా, వీడియో రికార్డింగ్ చేపట్టారు. డీఎస్పీ లింగయ్య, సీఐ రాంలాల్, ఎస్ఐ పి.రాజు ఆధ్వర్యం లో 150మంది పోలీస్ సిబ్బందితో గట్టి బందో బస్తు నిర్వహించారు. అంతకుముందు బందోబ స్తు విధులకు వచ్చిన పోలీసులు, అధికారులు, సిబ్బందికి ఎస్పీ డాక్టర్ వినీత్ మక్తల్ పట్టణంలోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వ హించి, భద్రతా సూచనలు చేశారు. అనంతరం మక్తల్ మినీ ట్యాంక్ బండ్ నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు. నారాయణపేటలో ఎస్పీ డ్రోన్ ద్వారా శోభా యాత్రను పరిశీలించి, కమ్యూనికేషన్ వ్యవస్థ (మ్యాన్‌ప్యాక్) ద్వారా ప్రార్థనా మందిరాలు, చౌరస్తా, నిమజ్జన ప్రదేశంలో బందోబస్తులో ఉన్న సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు.

పీపుల్స్ న్యూస్



# “పేదవాడి గుడిసె కనిపిస్తే కూల్చివేత..

- **పెద్దవాడి భవనం కనిపిస్తే మౌనం!**
- **నాలుగు ఇటుకలు తీసి డెమోలేషన్ చేసినట్లు రికార్డు.**

**కుత్బుల్లాపూర్ , సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు కనిపిస్తే చాలు.. అధికారులు వెంటనే రంగంలోకి దిగి కూల్చివేస్తున్నారు. కానీ అదే ప్రభుత్వ భూమిలో పక్కనే నిర్మించిన అక్రమ భవనంపై మాత్రం చర్యలు కనిపించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గాజులరామారం దేవేందర్‌నగర్‌లోని సర్వే నంబర్ 329లో ఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు పేదలు తలదాచుకునేందుకు వేసుకున్న గుడిసెలను తొలగించిన అధికారులు.. మరోవైపు అదే ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన భవనం వైపు ఎందుకు చూడటం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ భవనం మాజీ కార్పొరేటర్‌కు సంబంధించినదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే అది గుడిసె అయినా.. భారీ భవనం అయినా చట్టం ముందు ఒకటే కదా అని స్థానికులు నిలదీస్తున్నారు. పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించడంలో చూపుతున్న వేగం, మాజీ కార్పొరేటర్ నిర్మాణం విషయంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు.



**ఇటుకలు తొలగించి డెమోలేషన్ చేసినట్లు రికార్డు.**

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను గుర్తించి వాటిని తొలగించాల్సిన అధికారులు.. ఓ మాజీ కార్పొరేటర్‌కు చెందిన భవనం విషయంలో మాత్రం తూతూమంత్రంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణంపై డెమోలేషన్ చర్యలు చేపట్టినట్లు చూపించేందుకు భవనం పైభాగంలోని పెంట్‌హౌస్ వద్దకు చేరుకున్న అధికారులు.. అక్కడ నాలుగు ఇటుకలు తొలగించి, కూల్చివేత ప్రక్రియ పూర్తయినట్లుగా మమ అనిపించుకుని వెనుదిరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన భవనాన్ని పూర్తిగా తొలగించాల్సి ఉండగా.. అసలు నిర్మాణాన్ని అలాగే వదిలేసి కేవలం పైభాగంలో కొంతమేరకు దెబ్బతీసి వెళ్లడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ పేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసె వేసుకుంటే వెంటనే తొలగించే అధికారులు.. ప్రజాప్రతినిధిగా పనిచేసిన వ్యక్తికి చెందిన అక్రమ నిర్మాణం విషయంలో మాత్రం ఎందుకు వెనకడుగు వేస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు వస్తున్నారంటే.. నిర్మాణాన్ని పూర్తిగా తొలగించి ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం భవనం మొత్తం యథాతథంగా ఉండగా.. పెంట్‌హౌస్ వద్ద కొద్దిపాటి




ఇటుకలను తొలగించి అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ‘డెమోలేషన్ చేశామంటే రికార్డుల్లో చూపించుకోవడానికేనా?’ అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు నిజంగా అక్రమ నిర్మాణాన్ని తొలగించాలనే ఉద్దేశంతో వచ్చారా? లేక చర్యలు తీసుకున్నట్లు చూపించేందుకు మాత్రమే వచ్చారా? అన్న చర్చ స్థానికంగా జరుగుతోంది.

**అధికారులపై ఆరోపణలు**

ఈ వ్యవహారంలో అధికారులు డబ్బులకు దాసోహం అవుతున్నారంటూ కొందరు స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అయితే ఇవి స్థానికుల ఆరోపణలు మాత్రమే. వాటిని అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. భవన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, రెవెన్యూ రికార్డులు, ప్రభుత్వ భూమి స్థితిగతులు, గతంలో జారీ చేసిన నోటీసులు తదితర వివరాలను అధికారులు బహిర్గతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ బాధ్యత రెవెన్యూ, మున్సిపల్ తదితర సంబంధిత శాఖలపై ఉంటుంది. ఒకే స్థలంలో అక్రమ నిర్మాణాలపై భిన్నంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సర్వే నంబర్ 329లో మొత్తం ప్రభుత్వ భూమిని అధికారులు పరిశీలించి, ఆక్రమణలు, నిర్మాణాలపై వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.

# పట్టణాలు ధీటుగా గ్రామసీమలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి.

- **రూ 1.45 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం.**
- **రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి**



**ఏలూరు/ ఆగిరిపల్లి, సెప్టెంబరు 25:** ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి --విజయవాడ ప్రధాన రహదారి నుండి గొండపల్లి వరకు 2 కి.మీ. మేర రూ 95 లక్షలతో నిర్మించనున్న ఆర్‌డబి బిటి రహదారి పనులకు, ఆగిరిపల్లి గ్రామంలోని యాదవులు మండపం నుండి మెట్లకోనేరు వరకు రూ 50 లక్షలు యంపి ల్యాండ్స్ నిధులతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శుక్రవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసాధి పాల్గొని భూమి పూజలుచేసి, శంఖుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామ ప్రజలను పేరుపేరున పలకరించి గ్రామసమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ ప్రజలు, మహిళలకు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసాధి మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని, దశలు వారీగా మిగిలిన పనులు అన్నియు పూర్తిచేస్తామని అన్నారు. ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా గ్రామీణ రోడ్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ బాగుంటేనే ప్రజలు ఆరోగ్యజీవన విధానాలు మెరుగుపడతాయని, డ్రైనేజీ వ్యవస్థకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. నిర్మాణపనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతులను మెరుగు పరచడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుధ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా నిలిచిపోయి అశాంతి, కక్షసాధింపులు, అన్ని చోట్ల వేధింపులేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి బాటలో నడిపిస్తూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తోందని తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో జరుగుతున్న కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలు ఆశయాలే తమ అభివృద్ధి అజెండా అని, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శనియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అభివృద్ధి,సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని, నూజివీడు నియోజకవర్గం అభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరని మంత్రి స్పష్టం చేశారు. మంచి చేసే కూటమి ప్రభుత్వాన్ని అన్ని వర్గాలు ప్రజలు ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు, కూటమి నాయకులు, ప్రజలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా సమాచార శాఖ, ఏలూరు నుండి జారీచేయడమైనది.

# విజయవాడలో తొలిసారిగా ఢిల్లీ స్థాయి జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026

- **అక్టోబర్ 08 నుంచి 22 వరకు పున్నమి ఘాట్‌లో 600 స్టాళ్లతో నిర్వహణ**
- **దేశవ్యాప్తంగా 2,500 మంది మహిళా పారిశ్రామికవేత్తలు, గ్రామీణ కళాకారుల భాగస్వామ్యం**
- **ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెటింగ్, బ్రాండింగ్, విక్రయాలకు భారీ వేదిక**
- **కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయవాడ: సెప్టెంబర్ 25, 2026 :** విజయవాడ నగరంలో తొలిసారిగా ఢిల్లీ స్థాయిలో జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026 నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అక్టోబర్ 08 నుంచి 22వ తేదీ వరకు పున్నమి ఘాట్‌లో సుమారు 600 స్టాళ్లతో ఈ మేళాను నిర్వహించనున్నారు. మేళా నిర్వహణకు ఎంపిక చేసిన పున్నమి ఘాట్ ప్రాంతాన్ని శుక్రవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలు, స్టాళ్ల ఏర్పాటు, భద్రత, పార్కింగ్, విద్యుత్, తాగునీరు, సందర్శకుల సౌకర్యాలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మేళా నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, ఎన్‌ఆర్ఎల్ఎం జాయింట్ సెక్రటరీ స్వాతి శర్మ, డైరెక్టర్ మౌలిశ్రీ, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ సరస్ ఆజీవిక మేళా మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు తమ ఉత్పత్తులను జాతీయ స్థాయిలో ప్రదర్శించి విక్రయించుకునే మార్కెటింగ్ వేదికగా నిలుస్తుందని తెలిపారు. గత ఏడాది గుంటూరులో సుమారు 300 స్టాళ్లతో నిర్వహించిన సరస్ మేళాలో సుమారు రూ.30 కోట్ల మేర వ్యాపారం జరిగినట్లు తెలిపారు. ఈసారి విజయవాడలో 600 స్టాళ్లతో మరింత భారీ స్థాయిలో మేళాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సుమారు 2,500 మంది మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామీణ కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొని తమ రాష్ట్రాలకు ప్రత్యేకమైన హస్తకళలు, చేనేత, ఆహార పదార్థాలు, సహజ ఉత్పత్తులు, గ్రామీణ కళాకృతులను ప్రదర్శించి విక్రయించనున్నట్లు తెలిపారు. మేళాలో హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్, నేచురల్ ఫుడ్, లైవ్ ఫుడ్ తదితర విభాగాలతో పాటు నాబార్డ్, ఎంఎస్‌ఎంఈ, బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఇతర ప్రభుత్వ శాఖలకు కూడా స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. సరస్ మేళా ద్వారా ఎస్‌హెచ్‌జీ ఉత్పత్తులకు మార్కెట్ అనుసంధానాలు, బ్రాండింగ్, విలువ జోడింపు, నాణ్యత, ప్యాకేజింగ్, విక్రయాల విస్తరణకు అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. కొనుగోలుదారులు, సంస్థలు, మార్కెట్ ఏజెన్సీలతో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడటం ద్వారా మహిళా ఎస్‌హెచ్‌జీ సభ్యులకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. తద్వారా వారి ఆదాయం, స్థిరమైన జీవనోపాధికి మేళా దోహదపడుతుందని తెలిపారు. వెల్‌కమ్ పెవిలియన్, లెర్నింగ్ అండ్ నాలెడ్జ్ పెవిలియన్, కన్వర్జెన్స్ పెవిలియన్, లక్షపతి దీదీ పెవిలియన్, ఫుడ్ కోర్ట్, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, పిల్లల ఆటల ప్రాంతం, పార్కింగ్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. మహిళా సాధికారతకు సరస్ మేళా గొప్ప అవకాశం: కొండపల్లి శ్రీనివాస్ రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళా సాధికారతకు జాతీయ సారస్ ఆజీవిక మేళా గొప్ప అవకాశంగా నిలుస్తుందని అన్నారు. సాధారణంగా ఢిల్లీలో నిర్వహించే స్థాయి సారస్ మేళాను ఈ ఏడాది విజయవాడలో నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల ఎస్‌హెచ్‌జీలతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్, విక్రయ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. దసరా ఉత్సవాల సమయంలో మేళా నిర్వహించడం వల్ల విజయవాడలో ఉత్సవ వాతావరణం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ కళాకారులు తయారు చేస్తున్న నాణ్యమైన ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ‘స్వయం ఏపీ’ బ్రాండ్‌ను ప్రకటించి ముందుకు తీసుకెళ్లనున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. గత 35 సంవత్సరాలుగా డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజీ, స్వయం ఉపాధి, మార్కెటింగ్, వ్యాపార అభివృద్ధి తదితర అంశాల్లో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల ఉత్పత్తులకు స్థానిక మార్కెట్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మేళా విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, సెర్ప్, పోలీస్, మున్సిపల్, పర్యాటక, వైద్య ఆరోగ్య, విద్యుత్, అగ్నిమాపక, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక భద్రత వంటి అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మార్కెట్ అందుబాటు, ఉత్పత్తుల ప్రదర్శన, బ్రాండింగ్, ప్రత్యక్ష విక్రయాలు, వ్యాపార అనుసంధానాలు, మహిళా సాధికారత లక్ష్యాలతో జాతీయ సరస్ ఆజీవిక మేళా--2026ను విజయవాడలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లా సమాచార శాఖ, విజయవాడ నుండి జారీచేయడమైనది.

# ఎంఎస్ఎంఈల అభివృద్ధికి బ్యాంకుల బాసట

- **సులభతర రుణాలతో సమర్థవంతమైన చేయూత**
- **రుణ దరఖాస్తుల సత్వర పరిశీలన, పరిష్కారానికి బ్యాంకుల చర్యలు**
- **ప్రత్యేక సమన్వయ సమావేశంలో ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ కె.శ్రీధర బాబు**




ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు రుణ సహకారాన్ని బలోపేతం చేయడంతో పాటు, వారికి అవసరమైన మార్గదర్శకత్వం, చేయూత సేవలను సమర్థవంతంగా అందించేందుకు శుక్రవారం విజయవాడ వన్‌టౌన్‌లోని లీడ్ బ్యాంక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ కార్యాలయంలో ఎంఎస్ఎంఈ చేయూత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్, యూబీఐ జనరల్ మేనేజర్ కె.శ్రీధర బాబు, కేవీఐసీ స్టేట్ హెడ్ గ్రీప్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఎం.మధు, వివిధ బ్యాంకుల అధికారులు, పరిశ్రమల శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. సమావేశంలో ఎంఎస్ఎంఈలకు రుణ సదుపాయాలు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలు, రుణ ప్రతిపాదనల సత్వర పరిశీలన, పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకత్వం అంశాలపై చర్చించారు. అర్హత కలిగి, ఆచరణ సాధ్యమైన ఎంఎస్ఎంఈ ప్రాజెక్టులకు నిబంధనలకు అనుగుణంగా, తగిన మూల్యాంకనం అనంతరం ఆర్థిక సహాయం అందించేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పారిశ్రామికవేత్తలు తాము ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రాజెక్టు వ్యయం, మార్కెట్ అవకాశాలు, నిర్వహణ అవసరాలు, అంచనా ఆదాయం, వ్యయాలు, రుణాన్ని తిరిగి చెల్లించే సామర్థ్యం తదితర అంశాలపై స్పష్టమైన అవగాహనతో ప్రతిపాదనలు సమర్పిస్తే రుణాల పరిశీలన, మంజూరు ప్రక్రియ సులభతరం అవుతుందని శ్రీధర్‌బాబు తెలిపారు.

వ్యాపారం కోసం పొందిన రుణ మొత్తాన్ని, వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్దేశిత వ్యాపార అవసరాలకే వినియోగిస్తూ, సంస్థ కార్యకలాపా లను సజావుగా నిర్వహించి, రుణాలను సకాలంలో తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పూర్తి అర్హత కలిగిన రుణ దరఖాస్తులను బ్యాంకులు వీలైనంత త్వరగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. డాక్యుమెంటేషన్, పథకాల అర్హత, ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు ప్రతిపా దనల రూపకల్పన తదితర అంశాల్లో పారిశ్రా మికవేత్తలకు బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ అధికారులు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని నిర్ణయించారు. అర్హత కలిగిన ఎంఎస్ఎంఈ రుణ ప్రతిపాదనల పరిష్కారానికి బ్యాంకులు, డీఐసీ, కేవీఐసీ, ఇతర సంబంధిత శాఖల మధ్య నిరంతర సమన్వయం కొనసాగిం చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఏజీఎం (ఎంఎల్‌పీ) వెంకటేశ్వరరావు, ఏపీఐఐసీ జోనల్ హెడ్ రహీమ్, ఏజీఎం శ్యామ్, ఎన్‌టీఆర్ జిల్లా ఎల్‌డీఎం వెంకట సుబ్బయ్యతో పాటు వివిధ బ్యాంకుల అధికారు లు, పరిశ్రమల శాఖ అధికారులు, ఎంఎస్ఎం ఈ పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

(సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా ద్వారా జారీ)

# అద్దె చెల్లించడం లేదని ఈఎస్ఐ ఆస్పత్రికి తాళం

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 25 :** బూర్గంపహాడ్ మండలం పారిశ్రామికవాడ సారపాకలో ఐటీసీ పీఎస్పీడీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, కార్మికుల కుటుంబాల వైద్య సేవల కోసం నిర్వహిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రికి భవనం యజమాని తాళం వేశాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. సారపాకలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రికి చెల్లించాల్సిన అద్దె 15 నెలలుగా చెల్లించకపోవడంతో ఇంటి యజమాని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆస్పత్రి భవనానికి తాళం వేశాడు. దీంతో



మందుల కోసం వచ్చిన కార్మికులు, కార్మికుల కుటుంబ సభ్యుల వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. బకాయిల సమస్యను ముందుగా పరిష్కరించక పోవడంతో కార్మికులు ఇలా వైద్య సేవల కోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర వైద్యం సమయంలో ఇలా ఆస్పత్రి మూసివేస్తే తమ పరిస్థితి ఏమిటని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. ఆస్పత్రికి తాళం వేసి ఉండడంతో వైద్యం కోసం వచ్చిన రోగులు అక్కడే నిరీక్షించారు. ఈఎస్ఐ ఆస్పత్రి భవనానికి తాళం వేసిన విషయాన్ని ఆస్పత్రి వైద్యుడు చందు వరంగల్‌లోని జాయింట్ డైరెక్టర్ హేమలతకు వివరించగా




# అదరగొట్టిన భారత కబడ్డీ జట్టు.. ఫైనల్స్‌కి దూసుకెళ్లింది..

ఐచి: ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళ కబడ్డీ జట్లు అదరగొడుతున్నాయి. ఇప్పటికే మహిళ జట్టు ఫైనల్స్‌కి దూసుకెళ్లగా.. తాజాగా పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం ఐచి వేదికగా థాయ్‌లాండ్‌తో జరిగిన పోరులో ఘన విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది. థాయ్‌లాండ్‌పై భారత్ 66–28 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో భారత పురుషుల కబడ్డీ జట్టు తైవాన్ లేదా ఇరాన్‌తో తలపడే అవకాశముంది. అంతకు ముందు భారత మహిళల కబడ్డీ జట్టు కూడా సత్తా చాటింది. సెమీ ఫైనల్‌లో నేపాల్‌ను 48–24 తేడాతో భారత్ చిత్తు చేసింది. కాగా టోర్నమెంట్‌లో మెన్స్, ఉమెన్స్ కబడ్డీ జట్లు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు.

# భక్తితో నిమజ్జనం.. భద్రతతో సంబరం

**షామీర్‌పేట్ చెరువు వద్ద ఏర్పాట్లపై సీపీ సుమతి సమీక్ష**







**మల్కాజ్‌గిరి కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో సెప్టెంబర్ 25 (పీపుల్స్ న్యూస్)** గణేష్ నిమజ్జనం సందర్భంగా షామీర్‌పేట్ చెరువు వద్ద భక్తుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన ఏర్పాట్లను మల్కాజ్‌గిరి సీపీ బి. సుమతి, ఐపీఎస్ సమీక్షించారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్‌తో కలిసి నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించిన సీపీ.. బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా, క్రేన్లు, బారికేడ్లు, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణ తదితర ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జన ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా, ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసు సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సీపీ సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, రద్దీ నియంత్రణతో పాటు ట్రాఫిక్ సజావుగా సాగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# ఆసియా క్రీడలు.. భారత్‌కు రెండో స్వర్ణ పతకం..




జపాన్‌లో ఆసియా క్రీడలు 2026 ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంలో అథ్లెట్లు పోటీ పడుతున్నారు. కాగా, ఇప్పటికే భారత్‌కు క్రికెట్‌లో స్వర్ణపతకం లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మన దేశానికి మరో స్వర్ణ పతకం లభించింది. షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశ పరిచినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింద. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవట?ంలో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి పతకం లభించింది. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్2కు అర్హత సాధించారు. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. దక్షిణ కొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి.

# రజనీకాంత్ ‘జైలర్-2’ పాటకు డేవిడ్ వార్నర్ డ్యాన్స్ చేస్తే..



ఆసీస్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అంటే క్రికెట్ అభిమానులకే కాదు.. సినీ ప్రియులకు కూడా ఎంతో ఇష్టం. లాక్‌డౌన్ సమయంలో ఆయన పలు పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అప్‌లోడ్ చేసిన వీడియో ఎంతో వైరల్ అయ్యాడు. ఆ తర్వాత నుంచి వార్నర్‌ని డేవిడ్ భాయ్ అని పిలవడం ఫ్యాన్స్‌కి అలవాటు అయింది. గత ఏడాది నితిన్ హీరోగా వచ్చిన ‘రాబిన్‌హుడ్’ అనే సినిమాలో ఈ ప్రత్యేక పాత్రలో కనిపించారు వార్నర్. అయితే ఆ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేదు.ఇప్పుడు డేవిడ్ వార్నర్ మరో వీడియోతో ఫ్యాన్స్ ముందుకొచ్చారు. ‘జైలర్–2’ చిత్రంలోని ‘అల బోలేలో’ పాటకి వార్నర్ డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో అనేలా ఓ ఎఐ వీడియోని క్రియేట్ చేశారు. దీన్ని వార్నర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. “ఇది ఎవరు చేశారో నాకు తెలీదు.. కానీ, నా డ్యాన్స్‌కు ఎన్ని మార్కులు ఇస్తారు’ అని క్యాప్షన్ పెట్టాడు. దీనిపై అభిమానులు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు.

# విండీస్‌తో తొలి వన్డే.. సచిన్ రికార్డును కోహ్లీ బ్రేక్ చేస్తాడా?



వెస్టిండీస్ జట్టుతో ఆదివారం నుంచి టీం ఇండియా వన్డే సిరీస్‌లో తలపడనుంది. తొలి వన్డే తిరువనంతపురం వేదికగా జరగనుంది. ఇప్పటికే అక్కడకు చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే ఈ తొలి మ్యాచ్‌లో టీం ఇండియా పరుగుల రారాజు విరాట్ కోహ్లీ ఓ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉంది. అది ప్రస్తుతం భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. తిరువనంతపురంలో జరిగే వన్డేలో కోహ్లీ మరో 59 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసుకున్న క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు. విరాట్ ఇప్పటివరకూ 311 ఇన్నింగ్స్‌లో 14,941 పరుగులు చేశాడు. సచిన్ టెండూల్కర్ 377 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి చేరుకున్నారు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఓ మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 105 పరుగులు చేస్తే.. వన్డేల్లో 12,000 పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. మరి విరాట్–రోహిత్ ఈ రికార్డులు సాధిస్తారో లేదో చూడాలి.




# మన్‌ప్రీత్ కౌర్‌కు కాంస్యం

–హైదరాబాద్: ఆసియా క్రీడల్లో మహిళల షాట్ పుట్ విభాగంలో భారత్‌కు చెందిన మన్‌ప్రీత్ కౌర్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మన్‌ప్రీత్ తన నాల్గో ప్రయత్నంలో 17.17 మీటర్ల అత్యుత్తమ దూరాన్ని నమోదు చేసి పతకాన్ని ఖరారు చేసుకున్నారు. చైనాకు చెందిన సాంగ్ జియాయువాన్ 19.40 మీటర్ల ప్రదర్శనతో స్వర్ణాన్ని, అదే దేశానికి చెందిన జాంగ్ లిన్‌రు 18.14 మీటర్లతో రజతాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే ఈవెంట్‌లో మరో భారత క్రీడాకారిణి కృష్ణ జయశంకర్ మీనన్ ఐదవ స్థానంలో నిలిచారు.

# తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఓటమి

హైదరాబాద్: ఆసియా క్రీడల పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్‌సాయిరాజ్ రెడ్డి చిరాగ్ శెట్టి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన సుక్‌పున్, పక్కపోన్ టీరారత్సాకుల్ జోడీ చేతిలో ఓడిపోయారు. ఊహించని విధంగా నాలుగో సీడ్ హోదాలో బరిలోకి దిగిన ఈ భారత జోడీ, 21–12, 19–21, 14–21 తేడాతో ఓటమిని చవిచూసింది.





# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

హైదరాబాద్ : ఐచీ–నగోయా ఆసియా గేమ్స్‌లో ఆరో రోజు భారత్‌కు అద్భుతమైన ఆరంభం లభించింది. షూటర్లు సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజతం చేరాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో సురుచి, కమల్‌జీత్ జోడీ పసిడి పతకాన్ని ముద్దాడింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్‌తో కూడిన జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో దేశ పతకాల సంఖ్య 19కి చేరింది. మరోవైపు, స్వర్ణం గెలిచిన సురుచి–కమల్‌జీత్ జోడీ, క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా రికార్డును సమం చేయడం విశేషం




# అప్పుడు కాంస్యం.. ఇప్పుడు రజతం.. మారథాన్‌లో మళ్లీ మెరిసిన గుల్వీర్..!

జపాన్‌లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. పురుషుల100 మీటర్ల పరుగులో గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు నిరాశపరిచినా.. ‘నేనున్నాంటూ’ మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. దాంతో.. ఆసియాడ్‌లో వరసగా రెండో పతకం ఖాతాలో వేసుకున్నాడీ రన్నర్. 2023లో హంగ్జూలో గుల్వీర్ కాంస్యం సాధించాడు.పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో అసమాన పట్టుదలను ప్రదర్శించిన అతడు సిల్వర్ మెడల్ సాధించాడు. ఆసియాడ్ వంటి పెద్ద వేదికలపై నేను ఎప్పుడూ నిరాశపరచను అని చాటుతూ పోడియం మీద సగర్వంగా నిలబడ్డాడీ రన్నర్. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

## 'ది ప్యారడైజ్'లో కయాదు లోహర్ పాత్రపై విమర్శలు.. శ్రీకాంత్ ఓదెలకి నెటిజన్ల ప్రశ్నలు



నేచురల్ స్టార్ నాని నటించిన 'ది ప్యారడైజ్'కు విడుదల తర్వాత మిశ్రమ స్పందన వస్తోంది. సినిమా కథ, నాని నటన, యాక్షన్ సన్నివేశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఈ చిత్రంలో కయాదు లోహర్ పోషించిన సుబ్బు పాత్ర మాత్రం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆ పాత్రను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో సుబ్బు పాత్రకు సినీ నటి కావాలనే కోరిక ఉంటుంది. తల్లి వద్దని వారించినా మద్రాస్ వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతుంది. అదే సమయంలో తన తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న అవమానాలను చూస్తుంది. ఎలాగైనా ఆ అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న సుబ్బు.. డబ్బు కోసం బీ గ్రేడ్ చిత్రాల్లో నటించడం ప్రారంభిస్తుంది.ఇక్కడే 'ది ప్యారడైజ్'లోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బు నటించే బీ గ్రేడ్ చిత్రాలకు 'చుక్క చిత్రాలు' అనే పేరు పెట్టడం, వాటిని ప్రదర్శించే సన్నివేశాల్లో హీరోయిన్ పాత్రను చూపించిన తీరు అవసరానికి మించి గ్లామర్‌ను ప్రధానంగా చూపించిందని కొందరు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథలో ఆ పాత్ర ఎదుర్కొంటున్న బాధ, పరిస్థితుల తీవ్రత ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ కావాల్సిన చోట.. కొన్ని సన్నివేశాలు వేరే విధంగా స్పందన తెచ్చుకున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు సుబ్బు నడుముపై ఉండే సీతాకోకచిలుక టాటూ కూడా కథలో కీలకంగా ఉపయోగించారు. బీ గ్రేడ్ చిత్రాల్లో ఆమె ముఖాన్ని చూపించకుండా ఆ టాటూ ద్వారా గుర్తుపట్టేలా సన్నివేశాలను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని హీరో తెలుసుకున్న తర్వాత వచ్చే సన్నివేశంలో నాని చెప్పే కొన్ని సంభాషణలపైనా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మహిళలను అవమానించేలా అనిపించే పదజాలాన్ని ఉపయోగించడంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.వాస్తవానికి సుబ్బు పాత్ర వెనుక ఉన్న ఉద్దేశం భావోద్వేగంగా ప్రేక్షకులను కదిలించడమే అయి ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కుటుంబ అప్పులు తీర్చడానికి ఒక యువతి తనకు ఇష్టం లేని మార్గంలోకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత ఆ విషయం హీరోకు తెలియడం వంటి అంశాలతో బలమైన భావోద్వేగాన్ని పండించాలని దర్శకుడు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సన్నివేశాల చిత్రీకరణ కారణంగా ఆశించిన భావోద్వేగం కంటే భిన్నమైన స్పందన వచ్చిందని కొందరు ప్రేక్షకులు అంటున్నారు. సోషల్ మీడియాలో కొంతమంది కయాదు లోహర్ సన్నివేశాలనే సినిమా కు సంబంధించిన చర్చలో ప్రధాన అంశంగా మార్చుకుని ట్రోల్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ పాత్రను విమర్శించాల్సిన అవసరం లేదని, పాత్రను ఎలా రాశారు, ఎలా చూపించారు అనే అంశంపైనే చర్చ జరగాలని అంటున్నారు. అంటే.. విమర్శల ప్రధాన కేంద్రం కయాదు లోహర్ కాదు, ఆమె పాత్రను తెరపై ఆవిష్కరించిన విధానమే అన్నది వారి అభిప్రాయం.

## 'పార్కింగ్' దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా.. పూజా కార్యక్రమాలతో లాంచ్!




ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం. పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై కోలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ 'ఎస్కే27' షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు.కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ (ాఱఅఝుఎుఝతీఖ్ఱఎవఝుఅ) హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా 'ఎస్కే27' అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ప్రశంసలు పొందిన 'పార్కింగ్' (ఝుతీఎఱఅస్త్ర) చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదలయ్యాయి.

## తెలుగులోకి 'హనుమాన్ అన్స్'.. త్రివిక్రమ్ తప్పుకోవడంతో ఇప్పుడు హోంబళే ఫిల్మ్స్ ఎంట్రీ?




హిందీ చిత్ర పరిశ్రమలో భక్తి ప్రధాన కథాంశంతో రూపొందిన కొన్ని సినిమాలు ఇటీవల భారీ విజయాలను అందుకుంటున్నాయి. అదే బాటలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'హనుమాన్ అన్స్' కూడా మంచి ఆదరణను సొంతం చేసుకుంటూ వసూళ్ల పరంగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. భక్తి, పురాణ నేపథ్య అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ సినిమాపై ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి స్పందన కనిపించడంతో.. ఇప్పుడు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమాను అందించేందుకు తొలుత ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి.సినిమాకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆయన భాగస్వామ్యం ఉండబోతుందని ప్రచారం జరిగింది. దీంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు కొన్ని రోజుల ముందు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వల్ల త్రివిక్రమ్ ఈ సినిమా తెలుగు విడుదల వ్యవహారం నుంచి తప్పుకున్నారని ప్రచారం మొదలైంది. దీంతో అసలు 'హనుమాన్ అన్స్' తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి.ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దక్షిణాది ప్రేక్షకులకు సినిమాలను పరిచయం చేయడంలో ముందుండే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ 'హనుమాన్ అన్స్' తెలుగు సహా దక్షిణాది భాషల విడుదల బాధ్యతలను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం.అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హోంబళే ఫిల్మ్స్ ఈ సినిమాను దక్షిణాదిలో విడుదల చేస్తుందనే వార్త ప్రస్తుతం పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం మాత్రమే. సంస్థ నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హోంబళే ఫిల్మ్స్‌కు భక్తి చిత్రాల విషయంలో ఇప్పటికే అనుభవం ఉంది. ఇటీవల హిందీ నుంచి వచ్చిన 'మహావతార్ నరసింహ' చిత్రాన్ని కూడా దక్షిణాది ప్రేక్షకులకు చేరువ చేయడంలో సంస్థ కీలకంగా వ్యవహరించింది. ఆ సినిమా కూడా పురాణ, భక్తి నేపథ్యంతో తెరకెక్కినదే కావడంతో.. ఇప్పుడు 'హనుమాన్ అన్స్' విషయంలోనూ ఇదే సంస్థ పేరు వినిపించడం ఆసక్తిని పెంచుతోంది. ఒకవేళ హోంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని అధికారికంగా తీసుకుంటే.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసే అవకాశాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన దక్షిణాదిలోనూ సినిమాకు ఉపయోగపడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## మీ ప్రేమతో పాటు.. ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా: నాని



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ది ప్యారడైజ్'. గురువారం (సెప్టెంబర్ 24న) విడుదలైన ఈ సినిమాకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. కొంతమంది సినిమా బాగుందని చెబుతుంటే.. కొంతమంది తమకు నచ్చలేదని అంటున్నారు. అయితే సినిమాపై వచ్చిన రివ్యూలపై నాని స్పందించారు. సినిమాపై చూపిస్తున్న ప్రేమ, విమర్శలు రెండింటినీ స్వాగతిస్తున్నానని అన్నారు. "ది ప్యారడైజ్‌పై అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి #TheParadise తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయతకు నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి" అని నాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.కాగా, భారీ అంచనాల నడుమ విడుదలైన ప్యారడైజ్ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డుస్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది.

## సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసిన సూపర్ హిట్ సినిమా

కొన్ని సినిమాలు ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలై.. సూపర్ హిట్‌గా నిలుస్తాయి. అలా వచ్చిన సినిమానే ఇమ్రాన్ హష్మి హీరోగా నటించిన 'ఆవారాపన్-2'. 2007లో వచ్చిన 'ఆవారాపన్' సినిమాకి ఇది సీక్వెల్. మొదటి భాగం సినిమాని ప్రేక్షకులు థియేటర్లలో అంతగా పట్టించుకోలేదు. కానీ, ఆ తర్వాత టివిల్లో చూసి సినిమాని ఇష్టపడ్డారు. దీంతో ఆ సినిమా సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. అనుకున్నట్లుగానే 'ఆవారాపన్-2' గత నెల 14న థియేటర్లలోకి వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ.45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.213 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే ఇప్పుడు ఈ సినిమా సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్‌లో అద్దె విధానంలో అందుబాటులోకి వచ్చింది. త్వరలో ఉచితంగానూ స్ట్రీమింగ్‌లోకి రావచ్చు. హిందీలో మాత్రమే ఇది అందుబాటులో ఉంది.



## 'అనుమాన పక్షి' రివ్యూ.. విమల్ కృష్ణ టేకింగ్, రాగ్ మయూర్ నటన ఎలా ఉంది!




డిజె టిల్లు' వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం 'అనుమాన పక్షి'. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం.కథేంటంటే: సన్నీ (రాగ్ మయూర్) 'అనుమాన పక్షి' పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ.విశ్లేషణ: దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్ధంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్ధంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి.నటీనటుల ప్రతిభ: లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు.


Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com